# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 5-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 27 | పేజీలు 8 | వెల: రూ.1/-


## ముంబైలో ఆరెంజ్ అలర్ట్

### భారీ వర్షాలతో ప్రజల అప్రమత్తం

ముంబై,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముంబైకి కేంద్ర వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు అధికారులు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఇక వరదనీరు పోటెత్తడంతో పాల్ఘార్, రాయగడ్, రత్నగిరి, సియాన్, పరేల్, దాదర్, బైకుల్లా ప్రాంతాలు నీట మునిగాయి. కింగ్ సర్కిల్, రైల్వేస్టేషను, గాంధీ మార్కెట్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. శనివారం వరకు ముంబైలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితి ఎదురైతే ప్రజలు 100కు డయల్ చేయాలని ముంబై పోలీసులు కోరారు.

### 8న గవర్నర్‌గా..

# సౌందర్య రాజన్ ప్రమాణస్వీకారం

### - ప్రమాణం చేయించనున్న హైకోర్టు సీజే



హైదరాబాద్, సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ) : తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులైన తమిళనాడు బీజేపీ నేత తమిళసై సౌందరరాజన్ ఈనెల 8న(ఆదివారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 11గంటలకు ఆమెచేత హైకోర్టు సీజే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. తెలంగాణ గవర్నర్‌గా తమిళసై నియమితులైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర నూతన గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌కు బుధవారం ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతంగిరి నియామక పత్రం అందజేశారు. చెన్నైలోని ఆమె నివాసంలో అపాయింట్మెంట్‌లెటర్ ను అందించారు. ఈ సందర్భంగా కొత్త గవర్నర్ కు వేదాంతంగిరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు దక్కడంపై సంతోషం వ్యక్తంచేశారు. సెప్టెంబర్ 8వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆమె తెలిపారు. బీజేపీ తమిళనాడు ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆమెకు కేంద్రం గవర్నర్ గా అవకాశం కల్పించింది. తమిళసై సౌందర్య రాజన్ వృత్తిరీత్యా వైద్యురాలు. తమిళనాడు కన్యకుమారి జిల్లా నాగర్ కోయిల్‌లో పుట్టారు. మద్రాస్ మెడికల్ కాలేజీలో సౌందర్ రాజన్ ఎంబీబీఎస్ చదివారు. ఆ సమయంలో విద్యార్థి సంఘం నేతగా కూడా పనిచేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా కూడా ఆమె పనిచేశారు. ఇప్పటివరకు రెండు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లుగా ఎంపీగా పోటీ చేసిన ఆమె ఒక్కసారి కూడా గెలవలేదు. మొన్నటివరకు రెండు తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉన్న నరసింహన్ తెలంగాణ గవర్నర్ గా మారగా.. ఆయనను తొలగించి సౌందర్యరాజన్ ను తెలంగాణ గవర్నర్ గా నియమించింది కేంద్రం. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి గవర్నర్‌గా సరికొత్త రికార్డు నమోదు చేశారు నరసింహన్. రెండు రాష్ట్రాల తొలి ప్రభుత్వాలకు పూర్తి కాలం గవర్నర్‌గా పనిచేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏకంగా ఆరుగురితో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించిన నరసింహన్, 2010 నుంచి 2019 వరకు గవర్నర్ గా బాధ్యతలు నిర్వహించారు.



సిద్దిపేట జిల్లా తుక్కాపూర్‌లో మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న హరీష్ రావు ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు

# ముత్యంరెడ్డి అంత్యక్రియలు పూర్తి

### - అంత్యక్రియల్లో పాల్గొన్న హరీష్‌రావు, ఇతర రాజకీయ ప్రముఖులు


సిద్దిపేట, సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ) : మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి అంత్యక్రియలు బుధవారం అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. ముత్యంరెడ్డి స్వస్థలం తొగుట మండలంలోని తిక్కాపూర్ గ్రామంలో జరిగిన ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. అందులో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముత్యంరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, మదన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, సీపీ జోయల్ డేవిస్, మాజీమంత్రి సునీతా లక్ష్మా రెడ్డి, కార్పోరేషన్ ఛైర్మన్‌లు ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, బక్కి వెంకటయ్య తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, ముత్యం రెడ్డి అభిమానులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ క్రమంలో ముత్యం రెడ్డికి సంతాప సూచకంగా గౌరవ వందనం సమర్పించి పోలీసులు 3 రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. కాగా ముత్యంరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేయగా, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముత్యంరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ముత్యంరెడ్డి ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సిద్ధిపేట అభివృద్ధికి ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు.

## చరిత్రలో నేటినిజం



సాధనలో - ఉనదగు పరి
శోధనలో - తత్వము నకు శోభలు కూర్చిన
'రాధాకృష్ణను' గాంచి
మేధావిగ మదిన దలతు యించినభక్తిన్ !!

( సెప్టెంబర్ 5 రాధాకృష్ణన్ జన్మదినం..)



-రాధశ్రీ

సెల్: 9494481210

## నిజాలు!

ఆశలు బుసలుకొడితేనేం..!
వాస్తవం ఎప్పటికీ సమాజానికి బంధీనే..!!

అలంబన కాగల్గితె స్నేహం..!
ఉబుసుపోని ఊకదంపుడు ఎంతుంటేనేం..?!

తెగింపు ప్రచారాస్త్రం..!
విచ్చలవిడి కలివిడి.,పలుకుబడితో..!!

మనసు ముక్కలు కవితల్లో..!
కవి తల్లో తలపులు తునకలౌతూ..!!

గిడుగు అచ్చ తెన్గు నుడుగు..!
వ్యవహారిక భాషోద్యమ తొలి అడుగు..!!

పెట్టిపుట్టాలి పేరొందుటకు..!
రవిగాంచని కవులెందరో అంధకారాన..!!

అవకాశం అందుబాటు మూలం..!
అందలమెక్కేందుకు., ప్రజ్ఞావంతులైతేనేం..!!

మహాకవి., ప్రజాకవి..!
బహిరంగానొకరు అంతరంగానొకరు..!!

చిత్రమైన చిత్రకారులు..!
పెదాలే కుంచెలుగా .,మేను కాన్వాసుగా..!!



-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## క్యాబ్ డ్రైవర్ దురాగతం

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యువకుడి అపహరణ నగలు,నగదు అపహరించి వదిలేసిన వైనం రంగంలోకి దిగిన పోలీసులు..గాలింపు ముమ్మరం

హైదరాబాద్,సెప్టెంబర్4 (ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన ఓ యువకుడిని క్యాబ్ డ్రైవర్ అపహరించుకు పోయాడు. లండన్ నుంచి సొంతింటికి వెళ్తున్న ప్రవీణ్ అనే ప్రయాణికుడు అదృశ్యమయ్యాడు. మంగళవారం రాత్రి యూకే నుంచి వచ్చిన ప్రవీణ్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రైవేట్ క్యాబ్‌లో వస్తుండగా మార్గమధ్యలో దారి మళ్లించిన డ్రైవర్ అతనిపై దాడి చేశాడు. గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లిన డ్రైవర్ ప్రవీణ్ వద్ద ఉన్న రెండు లక్షల యూకే కరెన్సీతో పాటు బంగారు ఆభరణా లను ఎత్తుకెళ్లాడు. అనంతరం తల్లిదండ్రులకు ఫోన్ చేసిన ప్రవీణ్ జరిగిన విషయాన్ని వారికి వివరించాడు. తాను గుర్తుతెలియని ప్రదేశంలో ఉన్నానని.. ఇక్కడ ఉన్న కొండపైన గుడి ఉన్నట్లు చెప్పాడు. గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు వెల్లడించాడు. వెంటనే ప్రవీణ్ బంధువులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. హుటాహుటీన శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న బాధితుడి తండ్రి శేషగిరి పోలీసులకు ఫిర్యాదు. దమ్మాయిగూడకు చెందిన ప్రవీణ్‌కు మరో 15 రోజుల్లో వివాహం ఉండడంతో భారత్ కు తిరిగివచ్చాడు. కేసు నమోదు చేసుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు.. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రవీణ్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## కొత్త వాహన చట్టంతో భారీ చలానాలు

### స్కూటీ ఓనర్‌కు 16వేల జరిమానా

హైదరాబాద్,సెప్టెంబర్4 (ఆర్ఎన్ఎ): ఈ నెల 1వ తేదీ నుంచి మోటారు వాహనాల చట్టం-2019 అమల్లోకి వచ్చిన వెంటనే పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహన దారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు.

హర్యానాకు చెందిన ముకుల్ అనే వ్యక్తికి ట్రాఫిక్ పోలీసులు రూ. 16 వేలు జరిమానా విధించారు. బుధవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టగా.. స్కూటీని డ్రైవ్ చేస్తున్న ముకుల్ అడ్డంగా దొరికిపోయాడు. అతని వద్ద డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ)తో పాటు మిగతా ఆధారాలు లేకపోవడంతో రూ. 16 వేలు ఫ్లై÷న్ వేశారు. జరిమానా విధించిన పోలీసులు.. అతని స్కూటీని కూడా స్వాధీనం చేసుకు న్నారు. ఇప్పటికైనా వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీతో పాటు ఇతర ఆధారాలు వెంట తెచ్చుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. గురుగ్రామ్‌కు చెందిన దినేశ్ మదన్‌కు హర్యానా పోలీసులు రూ. 23 వేల జరిమానా విధించారు. అతను స్కూటీ నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. మదన్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, థర్డ్ పార్టీ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్‌తో పాటు హెల్మెట్ కూడా లేకపోవడంతో మొత్తం కలిపి రూ. 23 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

# చంద్రుడికి మరింత చేరువైన విక్రమ్!

### - రెండోసారి ల్యాండర్ కక్ష్య తగ్గింపు..
### - ల్యాండర్, ఆర్బిటర్‌ల పనితీరు భేషుగ్గా ఉంది
### - వెల్లడించిన ఇస్రో శాస్త్రవేత్తలు

శ్రీహరికోట, సెప్టెంబర్4 (ఆర్ఎన్ఎ) : చంద్ర యాన్-2లో కీలకమైన ల్యాండర్ విడిపోయే పక్రియ సోమవారం విజయవంతమైన విషయం తెలిసిందే. చంద్రయాన్-2 ఉపగ్రహం చంద్రుడికి 119 కి.మీ - 127 కిలోమీటర్ల కక్ష్యలో ఉన్నప్పుడు మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో ఆర్బిటర్ నుంచి విక్రమ్ ల్యాండర్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విడదీశారు. మంగళవారం ఉదయం 8.50 గంటలకు ల్యాండర్‌లోని చోదక వ్యవస్థను నాలుగు సెకన్ల పాటు మండించి దాని కక్ష్యను తగ్గించారు. తాజాగా, బుధవారం తెల్లవారుజామున మరోసారి కక్ష్య తగ్గింపును విజయవంతంగా పూర్తిచేశారు. బుధవారం తెల్లవారుజామున 3.42గంటల ప్రాంతంలో ఈ పక్రియను పూర్తిచేసినట్టు ఇస్రో వెల్లడించింది. ఇందుకోసం ల్యాండంలోని చోదక వ్యవస్థను 9సెకన్లపాటు మండించినట్టు తెలిపింది. దీంతో చంద్రుడికి విక్రమ్ మరింత చేరువైంది. ప్రస్తుతం ల్యాండర్ 35 కి.మీలీ 101 కి.మీ కక్ష్యలోనూ, ఆర్బిటర్ 96 కి.మీలీ 125కి.మీ కక్ష్యలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ల్యాండర్, ఆర్బిటర్‌ల పనితీరు సాధారణంగా ఉన్నట్లు ఇస్రో ప్రకటించింది. మిగిలిన రెండు రోజుల పాటు ల్యాండర్, రోవర్‌లోని వ్యవస్థల పనితీరును నిశితంగా పరిశీలించనున్నారు. సెప్టెంబరు 6న అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 నుంచి 2.30 గంటల మధ్య ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో దిగనుంది. ఇది జరిగిన నాలుగు గంటల తర్వాత అందులో నుంచి రోవర్ బయటకు వస్తుంది. సెప్టెంబరు 7 తెల్లవారుజామున 1.40 గంటలకు ల్యాండర్ 35 కిలోమీటర్ల లీ 97 కిలోమీటర్ల మధ్య కక్ష్యలో ఉన్నప్పుడు దాని పరిమితిని పరిశీలించి, 1.55 గంటలకు ఉపరితలంపై దింపనున్నారు. ల్యాండర్ దిగిన నాలుగు గంటల తర్వాత రోవర్ బయటకు రానుంది. జులై 22న జీఎస్ఎల్వీ-మార్క్3ఎం1 రాకెట్ ద్వారా చంద్రయాన్-2 కంపోజిట్ మాడ్యూల్‌ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్ 16.33 నిమిషాలలో నిర్ణీత కక్ష్యలోకి చంద్రయాన్-2 మాడ్యూల్‌ను చేరవేసి తన విశ్వసనీయతను నిరూపించుకుంది. కాగా, ఇప్పటి వరకు చంద్రుడిపై అధ్యయనానికి అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే ఉపగ్రహాలను పంపాయి. తాజాగా, చంద్రయాన్-2 ప్రయోగంతో వాటి సరసన భారత్ నిలిచింది. అంతేకాదు, వీటికి భిన్నంగా పరిశోధనలకు దక్షిణ ధ్రువాన్ని ఎంపికచేసుకుంది. సూర్యకిరణాలు పడిన ఈ ప్రాంతం చీకటిగా ఉంటుంది. ఈ ఛాయా ప్రాంతంలో ఖనిజాలు, నీటి వనరులు ఉంటాయని భావిస్తున్నారు.




కాళేశ్వరం పర్యటనకు బయలుదేరిన రైతుల యాత్రకు జెండా ఊపిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

# తెలంగాణకు వరప్రదాయాని కాళేశ్వరం

- కాళేశ్వరంతో కేసీఆర్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నారు
- తెలంగాణకు బీజేపీ ఒరగబెట్టిందేమీలేదు
- మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

### - 5వేల మందితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు వీక్షణకు వెళ్లిన కడియం

వరంగల్, సెప్టెంబర్4(ఆంఎన్ఎ) : తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్ట్ అని మాజీ డిప్యూటీ సీఎం, తెరాస నేత కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తికనబరుస్తున్నారు. ఇప్పటికే లక్షలాది మంది ప్రాజెక్టు నిర్మించిన ప్రాంతాల్లో పర్యటించారు. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో పాటు సుమారు 5వేల మంది టీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కాళేశ్వరం పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పదవుల కోసం కృష్ణా, గోదావరి నీటి హక్కులను తాకట్టు పెట్టి తెలంగాణను ఎండబెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సీఎం కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణకు బీజేపీ ఒరగబెట్టిందేమీలేదని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని, ఆ పార్టీ అంపశయ్యపై ఉందని ఎద్దేవా చేశారని కడియం అన్నారు. టీఆర్ఎస్ పార్టీని ఢీకొనే సత్తా మరో పార్టీకి లేదని కడియం పేర్కొన్నారు. తెలంగాణ లో 22 జిల్లాలకు నీరు అందించే తెలంగాణ వర ప్రదాయని ఈ కాళేశ్వరం ప్రాజెక్టు. ప్రపంచంలోనే తొలి అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం అతి తక్కువ సమయంలో చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో నిర్మితమైన ఇంజినీరింగ్ మహా అద్భుతమని కడియం కొనియాడారు. ప్రపంచంలోని ఇంజినీరింగ్ నిపుణులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు, కేంద్ర జల సంఘం అధికారులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు ఈ ప్రాజెక్టును ప్రశంసిస్తుంటే కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని కడియం పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు 82 వేల కోట్ల రూపాయలు అంచనా వ్యయంలో ఇప్పటి వరకు 53వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతిపక్షాలు చేసే విమర్శలు తిప్పి కొట్టాలని కాళేశ్వరం ప్రాజెక్టు కు వెళున్నామని కడియం వివరించారు.




## అక్షర ప్రణామం...

గురువర్యా!
బోధి చెట్టులాంటి మీ నీడనే కదా!
జీవిత పాఠాలు నేర్చుకున్నది

మీరు వెలిగించిన అక్షర జ్యోతులే కదా!
బతుకు దారులు చూపిస్తున్నవి

ఉన్నత విలువలు పెంచ
ఎంత "తపస్సు" చేశారో...

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ద
ఎంతగా "మేధోమథనం" గావించారో...

ఎంత జ్ఞానామృతాన్ని ఆర్తిగా
మస్తిష్కంలో నిక్షిప్తం చేశారో...

ఎన్ని బతుకు సుద్దులు
ముద్దగజేసి అందించారో...

శిలలం మేమైతే...
శిల్పులు మీరయ్యారు

క్రియలం మేమైతే...
కర్తలు మీరయ్యారు

విరులం మేమైతే...
తోటమాలి మీరయ్యారు

కనుపాపలు మేమైతే...
కంటి రెప్పలు మీరయ్యారు

జీవన చిత్రం మేమైతే...
విలువల వర్ణం మీరయ్యారు

సంపూర్ణ మూర్తిమత్వులుగా రూపుదిద్ద
జీవితాన్నే అంకితమిచ్చిన
గురుదేవా !

మీ ఆశయాల బాటన నడిచేము
మీ విజ్ఞాన కాంతుల
విశ్వపరివ్యాప్తం చేసేము

మీకు ఇదే మా మనః "ప్రమాణం"...
మీకు ఇవే మా అక్షర "ప్రణామం"....



– కోడిగూటి తిరుపతి
9573929493

## విజయసారథి గురువు

లక్ష్యసాధన ఛేదించుకు
తెలియని విషయాలెన్నో తెలియజెప్పి
అక్షరజ్ఞానం నేర్పి, ఆశీస్సులు పంచి
విజ్ఞాన సౌధంపై విజేతగా నిలిపి
అసాధ్యాలను సుసాధ్యం చేసే
మహనీయుడు గురువు
తన గమనం దారి మళ్లీనా
నడిచే లక్ష్యం గురితప్పిన
నిరంతర సాధనతో అడుగులేస్తూ
శిష్యబృందానికి అక్షర బాండాగారమై
విలువలెన్నో పంచి విజ్ఞులను చేసేది గురువు
తన లక్ష్యంలో శిష్యులు విజేతలై నిలబడితే
తనువంతా సంబరంతో నిండి
మనసంతా పరవళ్ళ లోగిళ్ళలో దాగి
గురుశిష్యుల బంధానికి బందీ అయ్యేది విద్య
అందుకే శిష్యకోటికి విజయాల వెనుక
వేగుచుక్కగా నిలబడేది గురువు
నాటికి నేటికి ఎప్పటికైనా
ప్రతి వ్యక్తి విజయాలకు వారధి
ముందు నిలిచి నడిపించే
సారథి గురువు



–ఉండ్రాల రాజేశం
9966946084

# "గురువులకు గురువు" సర్వేపల్లి !

గురువు ప్రాణమున్న పుస్తకం. మనం దిద్దిన అక్షరం జన్మంతా అండగా నిలుస్తుంది. ఓనమాలు దిద్దిన చేతులు జీవితాంతం బ్రతికే ధైర్యాన్నిస్తుంది. గురువు లేని చదువు, స్నేహం లేని తనువు, భూదేవికి బరువు.

విద్యావ్యవస్థకు అధ్యాపకులే మూలస్తంభాలు. పుస్తకాల కన్నా అధ్యాపకుల పాత్ర మహోన్నతమైనది. మొక్కలకు నీరు పోసి పెంచే తోటమాలిగా అధ్యాపకుడు విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి. ఆత్మబలం, నిగ్రహం, విజ్ఞానం, సమయస్ఫూర్తి అలవడినప్పుడే విద్యకు సార్థకత. సంకుచిత భావాలకు స్వస్తి చెప్పి మారుతున్న ఆధునిక సమాజానికి అనుగుణంగా తనకు తాను సంస్కరించుకున్న నాడే విద్య సార్థకమవుతుంది.

విజ్ఞానాన్ని రంగరించి, అణుకువను అనువుగా కూర్చి, భావిభారత పౌరుల్ని తీర్చిదిద్దే అక్షరశిల్పి. నాలుగు గోడలను నాలుగు దిక్కులుగా చేసి, తరగతి గదిలో అనంత విశ్వాన్ని ఆవిష్కరించే అద్భుత మేధావి గురువే. గురువు లేని విద్య కళ్ళెం లేని గుర్రం లాంటిది. క్రమశిక్షణే ప్రతిభకు గీటురాయి. విద్యార్థులు భవితవ్యానికి దిశా నిర్దేశకుడు ఉపాధ్యాయుడే. ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనది. మహోన్నతమైనది. సమాజానికి గురువు ఆదర్శంగా నిలవాలని, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువే. గురువులకు గురువైన సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా నెలకు 10000/– జీతం ఉన్నా 2500/– తీసుకుని మిగతా జీతాన్ని ప్రధానమంత్రి నిధికిచ్చిన ఉదార హృదయుడు.

గురువు మీద నమ్మకముంటేనే జ్ఞానం లభిస్తుంది. చీకటిలో నడవడానికి దీపం మీద ఎంత నమ్మకంగా ఆధారపడతామో, అదేవిధంగా మనలోని అజ్ఞానాన్ని తొలగించుకోవడానికి గురువు మీద అంతగా ఆధారపడాలి. గురువు చూపించిన దారిలో నడవాలి. మానవరూపంలో ఉండే దేవుడే గురువు. గురువు శుశ్రూషయే జ్ఞాన సాధనం. అక్షర కాంతుల్ని వెలిగిస్తేనే మానవజన్మ సార్థకమవుతుంది. విద్య జన్మతహ జీవిని అంటిపెట్టుకుని ఉండేది. విద్యా బోధనలో జ్ఞానానికి ఎంత ప్రాధాన్యత ఉందో, ప్రవర్తనకు కూడా అంతే ప్రాధాన్యత ఉంది.

అక్షరజ్ఞానం సముపార్జించుటయే కాదు. పది మందికి పంచాలన్న నియమంతో ఉపాధ్యాయ వృత్తిలో ముందుకు సాగారు. అక్షరాస్యతను పెంచడానికి అహర్నిశలు కృషి చేశారు.

విద్యకు విద్యార్థులు అంకితం. ఉపాధ్యాయులు విద్యార్థులకు అంకితం. ఈ అవినాభావ బంధంలో సంస్కారవంతమైన సమాజం నేడు నిర్మాణం చేద్దాం. అని చాటి చెప్పిన మహోపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజును ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.



భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తిరుత్తరణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మలకు జన్మించారు. కృష్ణ భక్తురాలైన తల్లి పుట్టిన బిడ్డకు రాధాకృష్ణన్ అని నామకరణం చేశారు. ఆయన విద్యాభ్యాసం తిరుపతి, నెల్లూరు, మదరాసులలో జరిగింది. ఆయన పాఠాలు చెపుతుంటే విద్యార్థులు ఆశక్తితో వినేవారు. ప్రపంచవ్యాప్తంగా పలు విద్యాసంస్థలలో గౌరవ సభ్యులుగా, విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ, భారతీయ సంస్కృతిని సర్వవ్యాప్తం చేసి మాతృదేశ ఋణం తీర్చుకున్న మహనీయుడు రాధాకృష్ణ పండితులు.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, అద్వైతం, భగవత్ గీతాలపై ఆయన వ్యాఖ్యానాలు, భారతీయ తత్వాన్ని యావత్ లోకానికి చేరువ చేశారు. మంచి ఉపాధ్యాయుల వల్లే మంచి విద్యార్థులు పుట్టుకు వస్తారన్నది రాధాకృష్ణన్ విశ్వాసం. అందుకే ఉపాధ్యాయులందరికీ స్ఫూర్తిప్రధాతగా నిలిచారు. ఏం చదివామన్నది ఎంత ముఖ్యమో, ఎంత నేర్చుకున్నామన్నది అంత కన్నా ముఖ్యమని చాటి చెప్పిన " గురువులకు గురువు " రాధాకృష్ణన్.



–తాడినాడ భాస్కరరావు
9441831544

## అతడొక సూరీడు!

అతడొక శాఖోపశాఖలుగా
విస్తరించిన మహావృక్షం
తనను తాను అంటుకట్టుకుంటూ
ఎన్నెన్నో పచ్చని అరణ్యాలను
సృష్టించే బోధి మాను!

అతడొక పుంఖానుపుంఖాలుగా
జ్ఞానకిరణాలు ప్రసరించే అంతరిక్షం
తనను తాను మధించుకుంటూ
ఎన్నెన్నో నక్షత్రాలకు జన్మనిచ్చే
పాలపుంత!

అతడొక క్రమక్రమంగా
విస్తృతిని పెంచుకునే జీవనది
తనకుతాను మళ్లించుకుంటూ
బీళ్లను సస్యశ్యామలం చేసే
నిరంతర చైతన్య ప్రవాహం!

అతడొక అహరహం
వెలిగే ఆకుపచ్చ సూరీడు
మెదడుపొలాల్లో జ్ఞానవిత్తులు చల్లి
అవి మొలకెత్తి,పుష్పించి,ఫలిస్తే
శిష్యోత్సాహంతో
మురిసిపోయే కర్షకుడు!

అతడొక నిరాడంబర
నిస్వార్థ కర్మయోగి
సుద్దముక్కలే పెట్టుబడిగా
నాలుగు గోడల మధ్య
దేశభవితకు రూపునిచ్చే
అక్షరశిల్పి!




– సాంబమూర్తి లండ
9642732008

# గురువుల ఔన్నత్యాన్ని చాటే "ఆచార్యదేవోభవ"

**పుస్తక సమీక్ష**


సమాజంలో గురువు స్థానం అత్యున్నతమైనది. తల్లి తండ్రి తరువాత వ్యక్తి జీవితంలో అత్యున్నత మైన వాడు గురువు. శిశువుకు విలువను నేర్పించడం వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువు పాత్ర ఎనలేనిది. అభివృద్ధి పథంలో నడిచే ప్రతి సమాజంలో గురువుల పాత్ర తప్పక వుంటుంది. ఆదర్శ ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడంతోనే సరిపెట్టుకోరు. ప్రపంచ గమనాన్ని అవగతం చేయడం ద్వారా విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధిస్తారు. ఆ ఆశయ సాధన దిశగా దిశానిర్దేశం చేస్తారు. ప్రతి గురువూ తన వ్యక్తిత్వం ద్వారా విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తారు. అలాంటి గురువు ఎప్పటికీ విద్యార్థుల మనసుల్లో దేవుడుగా నిలిచిపోతారు. ఇటువంటి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని గురించి దోరవేటి రాసిన కథల సమాహారమే "ఆచార్యదేవోభవ".

దోరవేటి వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తి రీత్యా చేయితిరిగిన రచయిత. కవి. తాను ఉపాధ్యాయ వృత్తిలో ఉండడంవల్ల ఆ వృత్తిలోని మంచి చెడులను పరామర్శిస్తూ రాసిన కథలివి. ఉపాధ్యాయ వృత్తి లోని సాధక బాధకాలను సాధికారికంగా ఈ కథలలో చర్చించ గలిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న వైరాలు, తద్వారా ఉపాధ్యాయ వృత్తి పట్ల సమాజంలో తగ్గుతున్న గౌరవం, క్రమశిక్షణ పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతను హరింప జేస్తున్న తీరు, ఎటువంటి భేషజాలు లేకుండా రచయిత ఈ కథలలో వివరించారు. ఉపాధ్యాయ సంఘాల పేరిట పాఠశాలలో ఎగ్గొట్టే తీరు అవార్డుల కోసం కక్కుర్తి పడుతున్న విధానం నిర్మొహమాటంగా ఆవిష్కరించారు ఉపాధ్యాయుడు సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.




ఈ సంకలనంలో మొత్తం 16 కథలు చోటుచేసుకున్నాయి. పిల్లల ఆదరణకు మించిన అవార్డులు ఉండవని పిల్లల కళ్ళలో కనిపించే వెలుగులే నిజమైన అవార్డులనే సందేశాన్ని "ఉత్తమోపాధ్యాయ" కథ అందిస్తుంది. ఇతర ఉపాధ్యాయుల గురించి చెడుగా మాట్లాడే ఉపాధ్యాయులకు, తాగి రోడ్లపై ఊగే ఉపాధ్యాయులకు చురకలంటించే కథ "లచ్చి దొంగ లక్ష్మణరావు". భార్యాభర్తలు ఉద్యోగుల అయిన ఇంట్లో బాధలను ఏకరువు పెట్టే కథ "కిక్ పాయింట్". ఉపాధ్యాయ వృత్తిలో విలువలు దిగజారుతున్న విధానం, కులతత్వం మతతత్వం వేళ్ళూనుకున్న వైనం, వ్యక్తిగత భావజాలాన్ని విద్యార్థులపై రుద్దుతున్న తీరును ఎండగట్టే కథ ని"ర్మాతలు". కరడుగట్టిన పాత భావాలను విడనాడి పరిస్థితులకనుగుణంగా తనను తాను దిద్దుకో గలవాడే ఉత్తమ ఉపాధ్యాయుడు అన్న సందేశాన్ని ఇచ్చే కథ "తథాస్తు". ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక ప్రహసనాన్ని నిలదీసే కథ "ఆచార్యదేవోభవ". ఆడ పిల్లలపై జరుగుతున్న యాసిడ్ దాడులు అఘాయిత్యాలకు పరిష్కారం చూపే కథ "విన్నపం". పరీక్షల్లో కాపీయింగ్ ప్రోత్సహించే పోలీసులు ఉపాధ్యాయుల కథ "జరజూస్కో". ఆలస్యంగా బడికి వెళ్లడం నచ్చని ఓ ఉత్తమ ఉపాధ్యాయుడి కథ "గుర్తింపు". సెల్ ఫోన్ వల్ల తిప్పలను హాస్యస్ఫోరకంగా చెప్పిన కథ "ఇల్లాలు సెల్లాలు". మంచి అలవాట్లను ప్రబోధించే కథ "టిక్.. టిక్..టిక్..". జీవితంలో విజయం సాధించడానికి మార్కులు మాత్రమే ప్రమాణం కాదు అని చెప్పే కథ "పశ్చాత్తాపం". కష్టం తో కాకుండా ఇష్టంతో విద్యార్థులు చదివేలా చేయాలని చెప్పే కథ "చదువు". మతం కంటే మానవత్వం గొప్పది అని చెప్పే కథ "దిద్దుబాట". ఈ సంకలనానికి తలమానికమైన కథ "సన్మానం". ఆత్మీయతతో కాకుండా కేవలం మొక్కుబడిగా చేసే సన్మానాలు నిజమైన ఉపాధ్యాయుడికి తృప్తిని ఇవ్వ లేవు అని చెప్పే కథ ఇది. రంగా రెడ్డి మాస్టారు పాత్ర ద్వారా ఆదర్శ ఉపాధ్యాయుని లక్షణాలను అందంగా ఆవిష్కరించారు. ఎంతకాలం జీవించామని కాదు, ఏం సాధించావు అన్నదే ముఖ్యం అనే సందేశాన్ని ఇచ్చే కథ "చివరకు మిగిలేది". ఈ విధంగా ఉపాధ్యాయ వృత్తికి సంబంధించి అనేక కోణాలు ఈ కథల్లో చిత్రించబడ్డాయి ఒక్క మాటలో చెప్పాలంటే గురువుల ఔన్నత్యాన్ని చాటిచెప్పిన కథలివి. వాస్తవిక జీవనాన్ని ప్రతిబింబించే ఈ కథలు పాత్రోచిత సంభాషణలతో పాఠకులను ఆకర్షిస్తాయి. ఉపాధ్యాయ రంగంలోకి అడుగు పెట్టబోయే యువతరానికి స్ఫూర్తినిచ్చే కథలు ఇవి. ఉపాధ్యాయ రంగంలో ఇప్పటికే స్థిరపడిన వారికి తనను తాను మెరుగుపరుచుకోవడానికి సాధనాలే ఈ కథలు.

( నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం)




-సాగర్ల సత్తయ్య
7989117415




ఇటీవల హైదరాబాదు త్యాగరాయ గానసభ, కళా లలితా కళా వేదిక లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత , కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన ఐదు బాల సాహిత్య గ్రంథాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణా రాష్ట్ర గ్రంథాలయ సంస్థల అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్. చిత్రంలో వరుసగా (ఎడమ నుండి)బాలసాహితీవేత్త శివ్వం ప్రభాకరం, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు చొక్కాపు వెంకటరమణ , దాసరి వెంకటరమణ , త్యాగరాయ గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి , హిప్నో కమలాకర్ , రచయిత సాంబరాజు ఉదయ భాస్కర రాజారావు.

## నేటి నిజాలు




## గురుభ్యోనమః

గురువుల
నిర్మల నిష్కల్మష
మనస్తత్వం,
దేశానికి అమృత కలశం.


ఆపదలలో
పరిష్కార
ఆలోచనల
అక్షయ పాత్రలా

రాజనీతి లో
అపర చాణక్యులు
రణరంగం లో సాంకేతిక
యోగీశ్వరులు
ఉపాధ్యాయులు

విశ్వమానవుడు
ఉపాధ్యాయుడు
స్వయం కృషితో
విశ్వఆదరణ పొందిన తత్వవేత్త

గురువులను
గౌరవిద్దాం, పూజిద్దాం
గురు దక్షణతో
రుణం తీర్చుకుందాం.

–యెల్దె సుదర్శన్ పద్మశాలి



ఆహ్వానం
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
ఆధ్వర్యంలో 18వ కార్యక్రమం
ప్రముఖ రచయిత్రి డా॥ సి.భవానీదేవి రచించిన
స్వాతంత్ర్యానంతర తెలుగు, హిందీ కవిత్వంలో స్త్రీ
(పరిశోధనా గ్రంథం)
బంగారు కల (చారిత్రక నవల)
ఆవిష్కరణ సభ
తేది: 15-9-2019 ఆదివారం ఉదయం 10.30 లకు
వేదిక: రెవెన్యూ భవన్, కలెక్టరేట్ కాంపౌండ్, డి.ఇ.ఓ ఆఫీస్ ఎదురుగా, గుంటూరు
సభాధ్యక్షులు: శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
పరిశోధనా గ్రంథం ఆవిష్కర్త: డా॥ వెన్నా వల్లభరావు
కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత
గ్రంథ పరిచయకర్త: శ్రీమతి షేక్ కాశింబి
కవయిత్రి
చారిత్రక నవల ఆవిష్కర్త: శ్రీ రావెల సాంబశివరావు
విశ్రాంత రిజిస్ట్రారు, నాగార్జున విశ్వవిద్యాలయం
నవల పరిచయకర్త: డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
ప్రముఖ సాహితీవేత్త
కీ.శే. శ్రీ కోటంరాజు సత్యనారాయణశర్మ,
శ్రీమతి అలివేలు మంగతాయారు స్మారక పురస్కార స్వీకర్త:
ప్రముఖ పద్యకవి శ్రీ కలువకొలను సూర్యనారాయణ గారు
ఈ కార్యక్రమానికి మీకిదే మా సాదర స్వాగతం
బి హనుమారెడ్డి – గౌరవ అధ్యక్షులు; ఎస్.ఎం.సుభాని – కార్యదర్శి; బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి – కోశాధికారి; చలపాక ప్రకాష్ – ప్రధాన కార్యదర్శి

ఉదయ సాహితి కరీంనగర్ సౌజన్యంతో...
ఆహ్వానము
భవాని ప్రచురణలు ఆధ్వర్యంలో
అర్ధ శతాధిక కవి సమ్మేళనం - 2019
తేది : 08-09-2019 ఆదివారం, వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
ఉ॥ 9-30 నుండి 9-50 : కవుల నమోదు కార్యక్రమం
ఉ॥ 9-50 నుండి 10-00 : జ్యోతి ప్రజ్వలన (ముఖ్య అతిథిచే)
సభా కార్యక్రమం (ఉ॥ 10 నుండి 10-30 వరకు)
సభాధ్యక్షులు : డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, ఉదయసాహితి అధ్యక్షులు, కరీంనగర్.
ముఖ్య అతిథి : శ్రీ జి.వి. శ్యాంప్రసాద్‌లాల్ గారు, సంయుక్త పాలనాధికారి, కరీంనగర్
ఆత్మీయ అతిథి : శ్రీ కళ్యాణం శ్రీనివాస్ గారు, యానిమేషన్ డైరెక్టర్ మరియు కార్టూనిస్ట్
కవి సమ్మేళనం
మొదటి ఆవృతం 10-30 నుండి 11 వరకు
నిర్వాహకులు : డా॥ కలువకుంట రామకృష్ణ గారు, ప్రముఖ కవి, ప్రిన్సిపాల్, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల, కరీంనగర్.
రెండవ ఆవృతం 11-00 నుండి 11-30 వరకు
నిర్వాహకులు : శ్రీ వేణుశ్రీ గారు, సహాధ్యక్షులు, సాహితీ గౌతమి, కరీంనగర్.
మూడవ ఆవృతం 11-30 నుండి 12-00 వరకు
నిర్వాహకులు : శ్రీ బుర్ర మధుసూదన్ రెడ్డి గారు, అధ్యక్షులు, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, కరీంనగర్.
నాల్గవ ఆవృతం 12-00 నుండి 12-30 వరకు
నిర్వాహకులు : శ్రీ మాడిశెట్టి గోపాల్ గారు, అధ్యక్షులు, సమైక్య సాహితి, కరీంనగర్.
ఐదవ ఆవృతం 12-30 నుండి 1-00 వరకు
నిర్వాహకులు : శ్రీ ఎ. గజేందర్ రెడ్డి గారు, అధ్యక్షులు, సమతా సాహితి, కరీంనగర్.
ఆరవ ఆవృతం 1-00 నుండి 1-30 వరకు
నిర్వాహకులు : శ్రీ అనుముల దయాకర్ గారు, అధ్యక్షులు, తెలంగాణ కళావేదిక, కరీంనగర్.
మ॥ 1-30 నుండి 2-00 భోజన విరామం
మధ్యాహ్న సభా కార్యక్రమం
సభాధ్యక్షులు : డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, ఉదయసాహితి అధ్యక్షులు, కరీంనగర్.
ముఖ్య అతిథి : శ్రీ దేవులపల్లి ప్రభాకర్‌రావు గారు, అధ్యక్షులు, అధికార భాషా సంఘం, తెలంగాణ
విశిష్ట అతిథి : శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
ఆత్మీయ అతిథులు : శ్రీ దాస్యం లక్ష్మయ్య గారు, ఉదయ సాహితి వ్యవస్థాపకులు.
శ్రీ వైరాగ్యం లక్ష్మీభవాని గారు, ప్రధాన కార్యదర్శి, భవాని ప్రచురణలు, కరీంనగర్.
పుస్తకావిష్కరణలు
మ॥ 2-00 నుండి 2-15 వరకు
కవన మంజరి (కవి సమ్మేళనం - 2019)
తెలుగు సౌరభాలు (పద్య కవితా సంకలనం)
సందేశాలు
మ॥ 2-15 నుండి 2-45 వరకు
ముఖ్య అతిథి మరియు ఇతర ఆహ్వానితుల సందేశం
మ॥ 2-45 నుండి కవుల సత్కారం
సా॥ 5-00 వందన సమర్పణ.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 5-9-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

ఏర్పాటు వాదం
గుడ్డెద్దు చేలో పడింది
నిజం దాగదు.

నిజాల మూట
నవ నిర్మాణ జాణ
వనితా తార.

జలాశయాలు
సాగుకు సరిపడ
పచ్చని రైతు.

వితండ వాదం
రాజపత్రం విడుదల
స్వేచ్ఛ పతాక.

వరద బాధ
నిందించకు వానను
ప్రభుత్వ వైఫల్యం.



- రేడియమ్
9291527757

**శ్రీనిజాలు**

టూ స్టేట్సు గవర్నర్ గా
తొమ్మిదిన్నర యేళ్ళు!
చెప్పండి నరసింహన్ కు
చేయెత్తి వీడ్కోలు!

కుమరి అనంతన్ కూతురు
డాక్టర్ తమిళిసై!
తెలంగాణ గవర్నరై
వచ్చే తెలుగిసై!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# జ్ఞాపకాలకు కవితారూపం

## 'స్లీపింగ్ విత్ ద రెయిన్‌బో' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధన్ కౌశిక్ తదితరులు.

ప్రముఖ కవి, రచయిత దేవిప్రియ రాసిన 'స్లీపింగ్ విత్ ద రెయిన్‌బో' పుస్తకా విష్కరణ జరిగింది. ఆయన భార్యరాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం కవితల రూపంలో రాసిన ఈ పుస్తకాన్ని బుధవారం సాయంత్రం సోమాజీ గూడలోని ప్రెస్‌క్లబ్‌లో సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులు, హిందీ పద్యకవి మాధవ్ కౌశిక్ ఆవిష్కరించారు. పుస్తకావి ష్కరణ సభకు ప్రముఖ రచయిత్రి ఓల్గా అధ్యక్షత వహించగా పుస్తకంలోని అంశాలను డా॥ విజయ్‌కుమార్, ప్రొ. శ్రీధర్ వివరించారు. ఓల్గా మాట్లాడుతూ ప్రేమలో ఎన్నో ఏళ్లు పరిణతి చెందాక రాసిన పద్యాలు పుస్తకంలో ఉన్నాయన్నారు.

# అంతరిక్షంలో మట్టి

మావాడు
పొద్దుననగా వెళ్లాడు
కొండాపురం వైపు
స్నేహితుణ్ని కలవాలని,
సాయంత్రం దాకా పత్తాలేడు.
ఇంట్లోవారి ఆందోళన
అంతరిక్షమంతగా విస్తరించింది

అలాగే ఓ పక్షి
సుదీర్ఘ యాత్రకు బయల్దేరింది.
ఒంటరిదే గాని
దానిని భూమ్మీది మట్టి చేతులే ఎగరేశాయి.
మట్టి మాటలు చెప్పి
మట్టి చూపుల్తో ధైర్యం చెప్పి పంపాయి.


అది వెలుతురా చీకటా!
దూరమా భారమా!

పంచేంద్రియాలకు అతీతమైన
ఒక మహా సంకల్పమా!
పిడికెడు మెదడు
ఐదు పదార్థాలతో కలగాపులగమైన
అపూర్వ సన్నివేశమా!
ఊహలో పట్టనంత ప్రయాణమది.

ఇంతలో
దబ్బున చప్పుడయ్యింది
ఆ చప్పుడుకు అనంతానంత శూన్యం
ఉలిక్కి పడింది
అంతటి విస్తృత ఆవరణం
ఆ కొంచెం మట్టి చలనాన్ని చూసి
ఆశ్చర్యానికి లోనయ్యింది.

ఆ ఒక్కక్షణంలో
శూన్యానికి అర్థమైన పాఠం ఇలా వుంది.
మట్టి మట్టిని ప్రేమిస్తుంది.
మట్టి కోసమే వెతుకుతుంది.
చందమామ అయినా
అంగారక గ్రహమైనా
మట్టికోసమే మనిషి రెక్కలు సారిస్తాడు.
ఆ రెక్కలు
మట్టిలోంచి మొలిచినవే,
ఆ రెక్కలకు మెరుగులు దిద్దటంలో
నిమగ్న మయ్యాడు కవి.


(చంద్రయాన్ సందర్భంగా..)





-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496
















# మధ్య తరగతికి అద్దంపట్టిన "చిదంబరం" కథలు

పుస్తక సమీక్ష

కథ, కథనానికి ప్రాధాన్యం ఉన్న సాహిత్య ప్రక్రియ. సమకాలీన సమాజంలోని విభిన్న అంశాలని ఇతివృత్తంగా తీసుకుని రాసిన కథలు చాలాకాలం పాఠకుల హృదయాల్లో నిలిచి ఉంటాయి. జీవితానుభవాల్ని కథలుగా మలచడం కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 60 సంవత్సరాల క్రిందటే ఆంధ్ర సచిత్ర వారపత్రిక, ఆంధ్రప్రభ వారపత్రిక లాంటి ప్రముఖ పత్రికల్లో కథలు ప్రచురింపబడటం గొప్ప విషయం. కూర చిదంబరం గారి కథల్లో క్లుప్తత, గుప్తత, శిల్పం, వస్తు ఎంపిక పాత్రలకల్పన స్పష్టంగా ఉంటుంది. 74 సంవత్సరాలలో తన అనుభవపాఠాన్ని "కథలు"గా రేపటి తరం కోసం చేసే అక్షర యజ్ఞం ఇది.

సామాజిక అస్తిత్వమే సమాజ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. ఇప్పటిదాకా 3 కథా సంపుటాల్ని చిదంబరం వెలువరించారు.

ప్రపంచానికే తొలి కథా కావ్యం అందించిన నేల - తెలంగాణ. అదే గుణాఢ్యుని "బృహత్కథ". సంఘాన్ని అన్ని కోణాలలో అందరూ ఉత్సుకతతో చదివేలా చేస్తున్న ప్రక్రియ కథానిక. 1902లో హిందూ సుందరి పత్రికలో "ధన త్రయోదశి" కథను బండారు అచ్చమాంబ రాసారు. అది తొలికథగా చెపుతారు. అలనాటి తెలంగాణ-హైదరాబాద్‌లోని జీవితాన్ని నెల్లూరి కేశవ స్వామి "చార్మినార్ కథలు" రాసారు.

కథ మానవ జీవితంలో ఒక అంశాన్ని చిత్రిస్తే; గల్పిక ఒక వ్యక్తి అనుభవాన్ని చెబుతుంది. కథను తపస్సుగా, యజ్ఞంగా రాస్తున్న వాళ్ళలో కూర చిదంబరం ఒకరు. వీటి కథలు ఊహ నుండి వాస్తవం వైపు పయనిస్తాయి. భావాలకి తగ్గ భాషని స్వంతం చేసుకుని ఆధునిక రూపాన్ని సంతరించుకుని సంపూర్ణ ప్రక్రియగా ఎదిగిన కథా ప్రపంచంలో తనదంటూ ఓ విశిష్ట శైలి; శిల్ప; శబ్ధ; అర్థ విన్యాసంతో... గొప్ప కథలు రాసారు చిదంబరం.

ఉషస్సు (2013), వేకువ (2016), నీటినీడ (2019) లాంటి అద్భుత కథా సంకలనాలు తెలుగు పాఠకులకు అందించిన కూర చిదంబరం కథల్ని రేఖామాత్రంగా పరిశీలిద్దాం! దాదాపు 14 కథలతో 'ఉషస్సు'; 23 కథలతో 'వేకువ'; 26 కథలతో 'నీటినీడ' కథా సంపుటాలు కూర చిదంబరం వెలువరించారు.

ప్రముఖ సాహితీవేత్తలు సుధామ, సినీ గేయ రచయిత భువన చంద్ర; గుడిపాటి, విహారి, డా॥ దేవరాజు మహారాజు; బి.పి. కరుణాకర్ లాంటి వారు విలువైన ముందు మాటలు రాసారు.

అమెరికన్ కవయిత్రి Maya Agelow అభిప్రాయం తనలో కథా రచనకు ప్రేరణ అంటారు చిదంబరం.

"There is no greater agony than bearing an untold story inside you" అంటారు మాయ.

వేకువ సంపుటిలోని కొన్ని కథలు మచ్చుకు చూద్దాం...

పురోహితుని జీవితంలోని బాధల్ని "వృత్తి ధర్మం"లో చక్కగా కథీకరించాడు. ఆసుపత్రుల్లోని దోపిడిని "జలగలు" కథ ద్వారా... అద్భుతంగా చెప్పారు.

అప్పున్నామ నరకం, మారిన విలువలు, దిల్లీకా లడ్డూ.... లాంటి కథలు... అద్దె ఇంటి బాధలు... ఇల్లు కట్టడం, అద్దెలకు ఇచ్చి ఆదాయం పెంచుకోవడం, అమ్ముకోవడం, ఇళ్ళు అమ్మించడం లాంటివి కథా వస్తువులుగా తీసుకొని రాసారు.

భార్య చనిపోయిన ఒంటరి జీవికి; స్నేహం ద్వారా "తోడు" దొరికిన వైనం చెప్పే మంచి కథ - తోడు.

నెల్లూరి కేశవ స్వామి కథ "షరీఫా"ను గుర్తుకుతెచ్చే కథ "మెహందీ అంటింది". అద్భుతంగా రాసారు చిదంబరం. ఈ కథకు సీక్వెల్‌గా "రేపటి వెలుగు" అనే కథానికను ఈ వ్యాసకర్తతో కలిసి (ద్వితీయ భాగంగా) రాసారు. పాఠకుల జనాదరణ పొందింది.

అలాగే సమాజంలో మంచి-చెడు పడుగు పీకల్లా సాగుతుంటాయి. మంచి, మంచితనం రూపం మార్చుకోవాల్సిన అవసరాన్ని "ఆపద్ధర్మం లో" సూచించారు చిదంబరం. మార్పుకోరే జీవితాన్ని పునర్జన్మ కథలో రాఘవయ్య పాత్ర ద్వారా చక్కగా చెప్పారు. దశాబ్దాల అనుభవం; అనుభూతి; జీవితసారం ఒడిసిపట్టి రాసిన అపూర్వ కథలివి.

అలాగే జమీందారీ విధానాన్ని అద్దంపట్టే "వేకువ" కథనే ఈ సంపుటికి హెడ్డింగ్‌గా పెట్టారు.

ఉషస్సు కథా సంకలనంలో 3 నాటికలూ ప్రచురించారు. వానవెలిసింది, చేదు నిజం, అద్దె గదీ - అగచాట్లు. కథా రచనకే గాక; నాటిక రచనలోనూ చేయి తిరిగిన వారేనని ఈ నాటికల సంవిధానంలో - పాత్రల సంభాషణల్లో అర్థం అవుతుంది. 14 కథలున్న ఈ సంపుటిలో పాప; అపశృతి; కళ్లు; ఉషస్సు; స్వర్ణశృంఖలలు; బ్రతుకు తిరగని మలుపు; మూసిన కిటికీ; నీటి మీద నిమ్నోన్నతాలు; మంచి కథలు; ఎల్లోరా గుహల వద్ద గైడ్ జీవితాన్ని చక్కగా చిత్రించారు.


"ఉషస్సు" సంపుటిలో పర్యావరణ ప్రాధాన్యత తెలియచెప్పే చక్కని కథ "మనిషీ - మాను" - గుడిపాటి వారు అన్నట్లు కథ చెప్పే రచయిత తీర్పరికానక్కర్లేదు. జీవిత వాస్తవాన్ని దర్శింపచేయ డానికి రచయిత పరిమితం కావాలి.

పర్యవసానాలు - ఫలితాలు... పాఠకుల యోచనకు విడిచిపెట్టడం కథాశిల్పంలో ఒక భాగం. ఆ పనిని చిదంబరం గారు గుర్తించి రాసా రు. స్త్రీ-పురుష సంబంధాలు విశ్లేషణ, నాటకీయత, అద్భుత ముగింపు ఇవ్వడం "ఎదురు తిరిగిన విధి" - అపశృతి - తీరిన సమస్య కథల్లో కనిపిస్తుంది.

మనసున్న మనుషుల్ని కంటతడి పెట్టించే గొప్ప కథ "కళ్లు" - లక్ష్మి భర్త రోడ్డు ప్రమా దంలో మరణం... కోర్టులో కార్మికులకు వ్యతిరేకంగా వచ్చే తీర్పులు... వెండికళ్ళు పెట్టుకొన్న వేణుగోపాలస్వామి గుడిలోని దేవుడి కళ్ళు.... చక్కటి సింబాలిజంగా రాసారు. ఆలిండియా రేడియోలో 1990లో ప్రసారం అయిన "చేదు నిజం" నాటిక బాగుంది. 1970లో ప్రసారమైన మరో నాటిక "అద్దె గదీ - అగచాట్లు" హాస్యభరితంగా సాగుతుంది.

అలాగే "తమ తమ నెలవుల్దప్పిన" కథలో మానవత్వం విలువలు... శవం... అంతిమ సంస్కారం... చందాల ఇతివృత్తం... ఎప్పుడో 80ల్లోని దివాకర బాబు "కుందేటి కొమ్ము" గుర్తుకు చేస్తుంది ఈ పై కథ. చేనేత కార్మికుల ఆకలి చావులు - వాళ్ళు వేరే వృత్తుల్లోకి మారిన వైనం తెలిపే కథ "నీటి మాట" ... ఆకలి మరణం తెలిపే "వాయసన్యాయం"లో రాఘవయ్య మరణం విషాదం. బెంగాలీ కథనాన్ని గుర్తు చేసే "మరీచిక" కథ చాలా గొప్ప కథ. విహారి అన్నట్లుగా "స్ప్లిట్ పర్సనాలిటీస్".


'పంచతంత్రం' కథల్ని గుర్తుకు చేస్తాయి. వీరి పోరాటపు బ్రతుకు మరియు కాకోపాఖ్యానం కథలు... మానవీయ కోణాన్ని ప్రసరించే వీరి తృతీయ కథా సంపుటి "నీటి నీడ" డా॥ కె.వి. రమణాచారి గారు 5వ సెప్టంబర్‌న ఆవిష్కరిం చనున్నారు. చార్టడ్ అకౌంటెంట్‌గా కూడా అపార అనుభవం గల కథకులు శ్రీ కూర చిదంబరం.



- తంగిరాల చక్రవర్తి
9393804473

# జ్ఞానమే మనిషికి వెలుగుబాట...!

ఆ నీలగిరి కొండలు దొంతర్లు దొంతర్లుగా
పచ్చనిగడ్డితో అలరారుతున్నాయి
దృశ్యమాలికలుగా అవి కనువిందు చేస్తున్నాయి
మనుషులు మాత్రం జీవన ఘర్షణలో వున్నారు
మృత్యు కుహరాల్లో తల దూర్చుతున్నారు
ఆ చేతుల్లో వున్న స్మార్ట్‌ఫోన్‌లో
ప్రపంచమంతా కనిపిస్తుంది కదా!
కోట్లాదిమంది ఆ మత్తులోనే జీవిస్తున్నారు
ఒక్క నిమిషం కూడా ఒక్క దృశ్యం మీద
కన్ను నిలవడం లేదు
సహచరిణితో పది నిమిషాలు గడిపే తీరిక లేదు
రాను రాను అక్షరదూరులు అవుతున్నారు
చిన్నపిల్లలు కూడా దృశ్యాల్లో మునిగితేలుతున్నారు
విద్యాగంథం వసివాడాల్సిందేనా!
ఆ పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి
ఆ శిశువు డెంగ్యూ వచ్చి మరణించింది
ఆ బంగారు రంగుతో చేసిన
వెంకటేశ్వరస్వామి బొమ్మ
ఊరేగింపు జరుగుతోంది
దీపాల పందిర్లలో
ఆ ఉత్సవ విగ్రహం ఊరేగుతోంది
మనుషుల్లో ఆంగిక ప్రదర్శన పెరిగింది
శరీర కాంక్షను మీరు రెచ్చగొట్టేకొలది
మీకు రక్షణ ఎక్కడ నుండి వస్తుంది?
కెమెరాతో మీరు చేసే విన్యాసాలు
భ్రమపూరిత సమాజాన్ని సృష్టిస్తున్నాయి
ఆ సౌందర్యమంతా నిజమైంది కాదు కదా!
మీరు ఆ నాలుకతో అన్నీ అబద్దాలే చెబుతారా!
ఎందుకు వాడు యువకులకు
కొత్తకొత్త అలవాట్లు నేర్పి కోట్లు గడిస్తున్నాడు
సిగార్లు కాల్చి కాల్చి తన పిత్రుడు
క్యాన్సర్‌తో మరణించలేదా?
వాడి చిరునవ్వు వెనుక
చురకత్తులు వున్నాయి సుమా!
అవును! మనుషులను బొమ్మలు చేశారు
ఆ ఆటలు చూపించి మతి భ్రమింపచేస్తున్నారు
మరోప్రక్క మంత్ర తంత్రాల సంరంభం.
తిరుపతి లడ్డుల్లో సూదుల ప్రత్యక్షం.
ఢిల్లీ వేంకటేశ్వరుడి హుండీ లూటీ!
విజయవాడ దుర్గమ్మ గుడిలో
అర్ధరాత్రి తంత్ర పూజలా!
మరోప్రక్క మహామహుల మరణజ్వాల!
అణు ప్రకంపనల ప్రేరణలు...
జీవించే హక్కు మీద గొడ్డలి వేటు
కాషాయిమూకల గంద్ర గొడ్డళ్ల ప్రదర్శనలు
మూలవాసులపై ద్వేషానలం
భారతదేశానికి వలస వచ్చిన దేవుళ్ల సంరంభం
దేవతల నాలుకలపై రక్తపు ధారలు
దేశంలో కక్షాకార్పణ్యాలు రగులుతున్నాయి
అక్షర గర్భం నుండి కులం పుట్టుక
మనిషిని మనిషిగా చూడలేని అంధత్వం
విద్యాలయ ద్వారాల్లో ర్యాగింగ్ ముళ్ల కంచె
సీనియర్ల పేరుతో రౌడీ గ్యాంగ్‌ల సంరంభం
సమాజాన్ని పట్టిపీడిస్తున్న వేధింపులు
రక్షకుడైన ఉపాధ్యాయుడి కంటి నుండే
కామపు చూపు
చిన్నపిల్లల మీద అఘాయిత్యాలు
వయసు రాకముందే భావ సంచలనాలు
టిక్‌టాక్ దృశ్య విన్యాసాల్లో వికృత చేష్టలు
తమను చూసి తాము మురుసుకునే
బింబాబింబ భావచలనాలు
స్వీయదృశ్య కాంక్ష, జ్ఞాన విదూరం కాదా!
తల్లిదండ్రులకు పిల్లలు ఆటబొమ్మలయ్యారు
నిరంతరం కెమెరా విన్యాసాలు
పిల్లల మెదడు పెంచే క్రమం లేదు
శరీర శుభ్రత మృగ్యం, ఆడంబర వస్త్రధారణ
అడిగిన వస్తువులన్నీ ముందు వాలుతున్నాయి
అభద్రతలో జీవనం, ప్రతిదానికి భయం
వెలుతురు లేనిదే మనుగడ లేదు
మెదడులోకి జ్ఞానం స్రవించుట లేదు
నిద్రకు, మెలుకువకు తేడా లేదు
వ్యక్తిత్వమున్న మనుషులు కావాలి
ఎగురుతున్న పక్షి గమనాన్ని...
పారుతున్న నది సవ్వడిని...
కురుస్తున్న వాన విలువని...
నాటుతున్న మొక్కను పెంచడాన్ని...
తెలుసుకుంటూ పిల్లలు పెరగాలి
జీవితం అంటే ఒక నిర్మాణం,
బొమ్మలాట కాదు సుమా!
పీల్చేగాలి ఊపిరి అని తెలియని వారెందరో!
ప్రతి సూర్యోదయం మనల్ని వెలిగించాలి
జీవితం అనే పాఠశాలలో
అన్ని శాస్త్రాలు వున్నాయి
ప్రకృతే అసలు గురువు
ఆడే బొమ్మల్ని కాదు,
జీవించే మనుషులను ప్రేమించండి!
జ్ఞానమే మనుషికి వెలుగు బాట!



- కత్తి పద్మారావు
సెల్:9849741695





గిడుగు రామ్మూర్తిపంతులుకు నివాళులర్పిస్తున్న బైస దేవదాసు, కళా జనార్ధనమూర్తి, గాయకురాలు శారద, వకుళాభరణం కృష్ణమోహన్ రావు.

# వాడుక భాషకు పట్టం కట్టిన 'గిడుగు'

గ్రాంథీక భాషలో ఉన్న తెలుగు భాషను ప్రజలకు చేరవయ్యేలా వాడుక భాషగా చేసేందుకు ఉద్యమంలా కృషి చేసిన మహానుభావుడు గిడుగు రామమూర్తి పంతులు అని రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఎందరో మహానుభావుల మధురస్మృతులతో.." కార్యక్రమంలో భాగంగా గురువారం తెలుగు వ్యవహార భాషా కోవిదుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సభ నిర్వహించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, గాయకురాలు శారద పాల్గొన్నారు.

# పరమ కిరాతకం

బాలల హక్కులను చిక్కుముల్లు తీసి
చిన్నారుల ముందుంచే నేను
కళ్లముందటి వికృతాలకి
హతాశురాలినయ్యా..!

ముక్కుపచ్చలారని పడిగుడ్డు
వాడికి చేతులెట్లా ఒచ్చెనో..!?
నడకన్నా నేర్వాని నవజాత శిశువు
ఎవడిని రెచ్చగొట్టిందనో!?
పాలుకారే పసిమొగ్గల
చిదిమేసే రాకాసుల లోకం ఇది..

ఆడదేహమైతే చాలు
నలిపినరికి పారేసే గుంటనక్కలు
హక్కులు..హక్కులని ఆరాటపడుతున్నానుగానీ
పుట్టేహక్కే లేని నా చిట్టి తల్లులు
పుట్టినా..
జీవించే హక్కెక్కడిదని!? నాదేశాన
పడగ నీడనకదా పసిపాపల బాల్యం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మేటి..
నూరుపగ్రహాలనొక్కసారే నింగికి పంపిందట..
అవును.. అది నా దేశమే..
ఆహా! ఓహో!! జబ్బలు చరుచుకుందాం రాండి..
పసిపాపల నలిపే విషసంస్కృతి
దునుమాడని ఆ ప్రగతి అదో: పాతాళానికే..

అన్నట్టిది..
పితృస్వామ్య పురుషాధిక్య సమాజం
ఆడశిశువును ఆడిగేదెవరని భరోసా..
అడుగడుగునా అత్యాచారాల పరంపరలే!
చట్టాలున్నాయట..చచ్చుబండలేకదా!
పసిమొగ్గలనుంచి...పండుటాకులదాక
ప్రాణాలరచేతే..
ఇదీ నా కర్మభూమి ..నిండా కీచకపర్వాలే...
కంచే చేను మేస్తుందోకాద
కనురెప్పే కాటేస్తుంది ఇంకో..కాద

ఆ ఐరాసానే కంఠ తడి పెట్టిందట
ఈ వికృత విషసంస్కృతిగని..
ఒరే..! చిత్తకార్తె కుక్కల్లారా..!!
పంటికి పన్నే.. కంటికి కన్నే సరి..

నువ్వు చిదిమేస్తున్న ఈ పసిమొగ్గే
రేపు నీకు జన్మనిచ్చే అమ్మ కదరా!
ఎక్కినకొమ్మే నరుక్కుంటున్న కసాయోడా..!!
కళ్లెప్పుడు తెరుస్తావురా!!?



-నాంపల్లి సుజాత
9848059893

# ఘనంగా జరిగిన అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం

భోపాల్‌కు చెందిన అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (ఎ.బి.బి.ఎస్.ఎస్) సదస్సు సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో (ఆగష్టు 25) సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు యూనివర్సిటీ మాజీ విసి డాక్టర్ ఆవుల మంజులతగారు ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో విభిన్న భాషా సంస్కృతులు, భిన్న ఆచారాలు, పురాణ కాలం నుంచి అలరారుతున్నాయని అన్నారు. సాహిత్యంలో విశిష్ట సేవలందించిన వివిధ రాష్ట్రాలకు చెందిన 23 మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. తెలంగాణకు చెందిన నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు పత్రిక నిర్వహణకుగాను రాష్ట్రీయ సంవాదశ్రీ" పురస్కార ప్రదానం చేశారు. పలు రంగాల్లో నిష్టాతులైన ఆచార్యకడారి సత్యమూర్తి, డాక్టర్ మరియా కుమార్, డాక్టర్ వడ్డేపల్లి క్రిష్ణ, రఘుశ్రీ, వాడపల్లి పద్మావతి, సి.హెచ్. సునీత, కే. లలిత, లక్ష్మీనాసు, ఆర్.వి. మాధురి గోపాల్ తదితరులు ఈ పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో పి.వి. మనోహర్‌రావు, ఏబిబి ఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్, సతీష్ చతుర్వేది, డాక్టర్ వీరేంద్రసింగ్ (భోపాల్), ఆచార్య కడారి సత్యమూర్తి అధ్యక్షులు తెలుగు శాఖ గోల్లమూడి పద్మావతి మహిళా విభాగ అధ్యక్షులు, పి.వి బ్రహ్మం (సహకార సారధి), డాక్టర్ బి. జయరాములు (వివ్వసాహితి అధ్యక్షులు), తంగిరాల చక్రవర్తి (కార్యదర్శి), తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 32 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించి శాలువా, మెమొంటోతో సత్కరించారు.



బైస దేవదాసుకు "రాష్ట్రీయ సంవాదశ్రీ" అవార్డు ప్రదానం చేస్తున్న ఎ.బి.బి.యస్.యస్. జాతీయ అధ్యక్షుడు డా॥ సతీష్ చతుర్వేది. వేదికపై డా॥ ఆవుల మంజులత, ఆచార్య కడారు సత్యమూర్తి డా॥ బి. జయరాములు, తంగిరాల చక్రవర్తి, జి. పద్మావతి, పి.వి. బ్రహ్మం, డా॥ మరియా కుమార్.



పలు రంగాల్లో అవార్డులు స్వీకరించిన వారితో అతిథులు.



మధ్యాహ్నం జరిగిన కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, తదితరులు.

## జాగ్రత!

అనాదిగా ఆడవాళ్ళకు అనునిత్యం పెనుసవాళ్ళే.
కడుపులో పడిననాటి నుండి
కాటికి పోయేదాకా కష్టాలే.
కడుపులో పిండాన్ని చదిమేయడం.
ఆడపిల్లలను అమ్మేయడం.
పసిమొగ్గలను చిదిమేసే
కామ పిశాచాలు.
కాలేజీ క్యాంపస్‌లలో
రాగింగ్ పేరుతో రౌడీయిజాలు
ప్రేమ పేరుతో యాసిడ్ దాడులు
గొంతులు కోసే ఉన్మాదులు.
ఆడది అబల కాదు సబల
ఆడది శాంతిస్తే శాంతమూర్తి
కోపమొస్తే ఆదిపరాశక్తి.
సృష్టిని ఆరాదించేది వాళ్ళే.
ప్రకృతిని ప్రేమించేది వాళ్ళే
కత్తులతో కూరగాయలుకోస్తారు
అవసరమైతే కంఠాలు కోస్తారు.



–కోణం పర్శరాములు
9959524585

## అనుమానం

మధ్య రాతిరి మెలుకువ వచ్చింది
మనసు ఎందుకో కలత చెందింది

కారణం వేతుకులాటలో తెల్లారిపోయింది
కలత చెందిన మనసు ఊరుకోక

ఆలోచనల వలలో చిక్కుకుని
సందేహం అనే చేపలా కొట్టుకుంటూ...

వలనుండి బయటికి రావడానికి
గెంతులు వేయసాగింది.....

మిట్టమధ్యాహ్నం అయింది
దారి తెలీక సాయం సంధ్యలో

సందేహం అనే చేపకు
అనుమానం అనే పెద్ద
చేప తోడయింది.....

ఆ వెతుకులాటలో ఇంకొన్ని
చేపలు తోడయ్యాయి....

ఇంతలోఅప్పటి వరకు చూస్తూ
వున్న అనుమానం అనే...
ఇంతింతై వటుడింతై అన్నట్లు
అనుమానం పెరిగి పెద్దదై

పెద్ద చేప ఆకలికి ఆగలేక
అన్ని చేపలను ఆరగించింది..

ఇంతలో జాలరి వచ్చి వలను
తీసి మిగిలి వున్న అనుమానం
అనే పెద్దచేపను అంగడికి
తీసుకుపోయాడు....

జాలరి చేతినుండి బయటపడే
మార్గం తెలీక బలై పోయింది
అనుమానం అనే చేప......



పి.విశాలాక్షి
9908435805



## తెలంగాణ సింధూరం


ఓటమికి క్రుంగిపోక
గెలుపు కొరకు సాధన చేసి
ముచ్చటగా మూడోసారి ఫైనల్ కు చేరి
ప్రపంచ బ్యాడ్మింటన్ విజేతగా
40 సంవత్సరాల కలను సాకారం చేస్తూ
భారత త్రివర్ణాన్ని రెపరెపలాడిన
తెలంగాణ ముద్దుబిడ్డ పివి సింధు
ఓటమి గెలుపునకు నాంది అంటూ
పట్టుదలతో సాధించగలమని
అందని ద్రాక్షగా మిగిలిన
ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ ఒడిసిపట్టి
నవ యువ క్రీడాకారులందరికీ
సింధు విజయం స్పూర్తిదాయకం
కాంస్యతో మిడిసి పడక
రజతంతో ఎగిసి పడక
స్వర్ణ విజేతగా సాగిన నడక
సింధు అద్భుత విజయాల గీతిక
మనిషి జీవితానికి ఓర్పు అవసరం
అనుభవంలో వచ్చిన మార్పు
విజయానికి వారధిగా నిలిచి
గురువు అడుగుజాడల్లో నడిస్తే
అద్భుతాలు సృష్టించవచ్చు
అందుకు సాక్ష్యం పివి సింధు
నేడు తెలంగాణ సింధూరమై
భారతావని చరిత్రలో
పి వి సింధు
స్వర్ణ పతాకమై నిలిచింది



–ఉంద్రాల రాజేశం
9966946084

## స్వర్ణం గెలిచిన సింధు

పడి లేచే కెరటంలా
అలుపెరుగని పోరాటం చేసి
ఆకాశాన్ని అందుకుని
తన కలసాకారం చేసుకుని
స్వర్ణపథకం మెడలో
అలంకరించుకుని
బ్యాడ్మింటన్ చరిత్రలోనే
తొలి భారతీయ మహిళగా
వరుస విజయాలతో
జైత్రయాత్రచేసి
సాధించిన విజయాన్ని
తల్లికి పుట్టినరోజు
కానుకగా సమర్పించి
ప్రశంసల వర్షం పొందింది.
ఇలా,జయభేరిని మ్రోగించి
భావితరాలకు ఆదర్శంగా
నిలిచింది సింధు.
ఆరంభంనుండి,తగ్గని
దూకుడుతో ,ఈ పిడుగు
చేసిన దండయాత్ర,ఇది.
గతంలో, ఈ తెలుగుతేజం
కాంస్య,రజత పథకాలు
తన,కైవశంచేసుకుంది
ఇప్పుడు, జపాన్ క్రీడాకారిణిని
మట్టికరిపించి,
మన త్రివర్ణ పతాకాన్ని
రెపరెపలాడించి
మనజాతీయగీతాన్ని
ప్రపంచానికి వినిపించింది
మన చరిత్రలో
ఈ అధ్యాయాన్ని
సువర్ణాక్షరాలతో లిఖించింది
స్టార్ షట్లర్ సింధు



–ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## కడారు మనో గీతికలు

కవితకు వన్నె తెచ్చేవి
వస్తుశిల్పాలే!
సహృదయ పాఠకులు లేకుంటే
ఎన్ని వున్నా వ్యర్థమే!

జీవితం ఓ వినూత్న పాఠశాల
నేర్చుకోగలిగితే నిత్యం ఓ కొత్తపాఠం!
అలవాటైతే
అది ఒక విజ్ఞాన పీఠం!

ప్రేమ
గుండెల్లో కాదు
చేతల్లో కనబడితే
అందం!

చతుష్షష్టి కళలలో
విలక్షణమైంది చోరకళ!
వంటకాలలో మసాలాలెన్ని వున్నా
ఉప్పుకే ప్రాధాన్యమెక్కువ!

నిన్న జరిగింది భారతమే అయితే
నేటి 'రామాయణమే' దానికి కొనసాగింపు!
చిందించేది చిరునవ్వులే ఐనా
పెదవులు కురిపించేది తేనె ధారలే!

నిజాయితీ గల వ్యక్తికి అధికారం
నెత్తి మీది నిప్పుల కుంపటితో సమానం!
మానవత్వం గల మనిషికే
అడుగడుగున ఆటంకాలు!

ప్రియురాలి వలపు
మేలిమి బంగారం!
అలిగిందంటే
ఆర్పలేని అంగారం!

పొగడ్త
ఫిల్టర్ కాఫీ లాంటిదా?
అసలు కాఫీ తక్కువ
కొసరు నురగెక్కువ!

'స్వచ్ఛభారత్' పుణ్యమా అని
అధికార్లతో గల్లీలన్నీ కళ కళ!
'సఫాయి సఫారీ'లతో



–కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

## హరిత పండగ

ఉద్యమంలో ఊపిరి వదిలిన
అమర వీరుల సాక్షిగా
బంగారుతెలంగాణాలో
బతుకులు సుభిక్షము చేయగా
అలనాటి అశోకుడు
వనజీవిరామయ్యను
స్ఫూర్తిపొంది సాగుదాం
పచ్చదనం పెంచుదాం !
ప్రభుత్వశాఖలన్నీఒక్కటవ్వగ
ఊరువాడాఏకమవ్వగా
చిన్న పెద్దతేడా లేదుగా
కాలుష్యాన్నికట్టివేయగా
రైతన్నల కరువు తరమగా
పంటసిరులు చెంతచేరగా
పల్లెజనం మురిసిపోగా
తెలంగాణ వెలిగిపోగా
హరితహారం తోడవ్వగా
ఒక్కొకమొక్క నాటుదాం
అన్నిచెట్లు పెంచుదాం
హరిత పండగనే చేద్దాం !
భావితరం బావితకై
బంగారు బాటనే వేద్దాం !!



–వి.రమేష్
9492626406

## వస్తున్నాం మామయ్యా! చంద మామయ్య!!

మామయ్యా చందమామయ్యా
వస్తున్నాం నీ చెంతకు వడి వడిగా
నరేంద్రభాయి శివన్‌జీ పంపిన
విక్రమ్ రోవర్‌తో ఇనుమడించిన
ఆనందోత్సాహల్తో వస్తున్నాం!

ఇన్ని యుగాలుగా నిరవధికంగా మాకు
కురిపించిన వెన్నెల కాంతుల
నజరానాకు ఫిదా అయి
మా భూమి తల్లి మూట గట్టిన
ఢిల్లీవాలా మిఠాయిల్తో మా
ముద్దులొలికే మేనమామయ్య చెంతకు
వస్తున్నాం సెప్టెంబర్ ఏడున మబ్బున్నే!

నీ అందమైన మేను
నీ ముసి ముసినవ్వుల మెరిసే మోము
కళ్లారా తనివితీరా చూసేందుకు
నీ ప్రేమ వాత్సల్యాల్ని
మరింతగా జుర్రుకునేందుకు
వేన వేల చిత్రాల్ని అందుకునేందుకు
వస్తున్నాం నీ ఒడిలోకి వడి వడిగా..
మమ్మల్ని సమాదరిస్తావనే
నిండైన భరోసాతో
మన ప్రేమ బాంధవ్యాన్ని
ధృఢంగా అల్లుకునేందుకు
అంతకంతకూ పెంచుకునేందుకు
నీ వెలుగు నీడల జాడల్ని
కానుకలుగా స్వీకరించేందుకు
లక్షల మైళ్ల దూరంలో ఉన్న
నీ కక్ష్యలోకి నీవే లక్ష్యంగా
క్రమ క్రమంగా నీతో
కరచాలనం చేసేందుకు
అలయ్ బలయ్ పొందేందుకు
సెప్టెంబర్ ఏడున
ఖరారైన ఘడియతో
దిగనున్నాం నీ ముంగిటిలో
అన్నీ కూలిస్తాయనీ
అక్కున చేర్చుకుంటావనీ..
వస్తున్నాం నీ చెంతకు
మామయ్యా చందమామయ్యా!!



డా॥ దామెర రాములు
సెల్:9866422494

## మాయదారి మొగుడితో వేగలేను


ఈ ప్రపంచం
బాధలు పెడుతున్న ఓ మాయదారి మొగుడు,
చచ్చిపోదా మనుకున్నా కాని
నా మనసులో
ఓ కావ్యం బిడ్డ ఎదుగుతూ...

బిడ్డ పుట్టాక వెళ్లి పోదామనుకున్నా కాని
కాస్త నడక నేర్చేదాకా
బతికితే బాగుంటుంది గదా!

ఇక సమాజంలో
నడుస్తున్నదిలే అనుకొని
వెళ్లిపోదా మనుకున్నా...
అయ్యో, మళ్ళీ
నా మనసులో మరో కావ్యానికి విత్తనం పడింది...

నేను చావటానికి సిద్ధమే కాని
భ్రూణ హత్యకు పాల్పడలేను,
ఈ ప్రపంచం మీద విపరీత కోపమే కాని
నాకు పుట్టే ప్రపంచం మీద ఎంతో ప్రేమ...

పుట్టే బిడ్డలకు వాడి పోలికలే వస్తున్నాయి,
వాళ్ళను చూసైనా
సన్నాసి మొగుడు మారితే బాగుంటుంది!
అందరం
సంతోషంగా ఉంటాము గదా!



–డా. రావి రంగారావు
9247581825

ఆహ్వానము

సౌమిత్రి పబ్లికేషన్స్, సికింద్రాబాద్ మరియు
ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్తంగా నిర్వహించు,

కూరచిదంబరం రచించిన

నీటి నీడ (కథాసంకలనం)
మరియు
అనుభవాలు-పాఠాలు (వ్యాససంకలనం)

పుస్తకావిష్కరణ కార్యక్రమము

తేది: 05-09-2019, గురువారం సా॥ 06:00 గం॥లకు
కళా వెంకట దీక్షితులు హాలు శ్రీత్యాగరాయ గానపభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసుగారు, సంపాదకులు, నేటినిజం దిన పత్రిక
విశిష్ట అతిథులు : శ్రీ కళా జనార్ధన మూర్తి గారు,
అధ్యక్షులు శ్రీ త్యాగరాయ గాన సభ
శ్రీ విహారి గారు, కవి, సాహితీవేత్త
శ్రీ పొత్తూరి సుబ్బారావుగారు,
కవి, సంపాదకులు సాహితీకిరణం మాస పత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీ తంగిరాల చక్రవర్తిగారు, కవి, సాహితీవేత్త.


సౌమిత్రి పబ్లికేషన్స్
సికింద్రాబాద్

శ్రీమతి. కళా శారద దీక్షితులు
ప్రధాన కార్యదర్శి
శ్రీ త్యాగరాయ గానసభ

అందరూ ఆహ్వానితులే.....

# ముంబయి కవితా స్వరాలు










ఇటీవల ముంబాయిలో "తెలుగు రైటర్స్ అసోసియేషన్, మహారాష్ట్ర (త్వమ్)" సమావేశంలో పలువురు కవులు వినిపించిన కవిత్వం ఇది. కవులను ఏకం చేయడంలో కృషి చేస్తున్న సంగెవేని రవీంద్ర అభినందనీయుడు.


-సంపాదకులు
















## భాషోన్నతి

కవితా పితామహుడు
కవి సార్వభౌముండు
తేట శృంగారమ్ము
తెలుగు భాష తేజమ్ము.

తేనెలొలికే భాష
తేటదనమున భాష
రతనాల నొకచోట
రాశిబోసినయట్లు.

కామధేనువు పొదుగు
కమ్మదనమ్ము తెలుగు
పలుకు ముత్యాల వలె
పద్యగద్యము లొలుకు

దివ్యమైనది ఘనత
కావ్యమైనది చరిత
తెలుగు భాషను పెంచ
వడి రా జనార్ధనా..!



– దోమల జనార్ధన్
సెల్: 097025 88946

## నవ సుప్రభాతం

మనం పయనించే
ఈ జీవన గమనంలో...

మరో ఉదయం
మరో అవకాశం...
మరి కొన్ని గంటలు
ఇంకొన్ని క్షణాలు..
అన్నీ కాలానుగ్రహాలే..!

నిన్ను బాధ్యతగా
నువ్వే బాధ్యతగా
ఆచరిస్తే వేయి వేనల
దీవెనల ఫలితం...!

నిన్ను చైతన్యమూర్తిగా మారుస్తూ
ఓ మహాత్ముని చేస్తూ
గౌరవాన్ని నీకు
చిరునామాగా రాస్తూ...
నీ పునీత వ్యక్తిత్వానికి
చేతులు జోడిస్తూ...
పనిమంతునికి ఈ ప్రపంచం
నీరాజనాలందిస్తూ...

ఇవే విజేత లక్షణాలనీ
ఈ జగతికి తెలియచేస్తూ...!



– రవీణా చవాన్
సెల్:099229 27527

## ప్రేమ తరంగాలు

చెరువు గట్టు మీద కూర్చుని
నీళ్ళలో గులక రాళ్ళు వేస్తూ
చూస్తున్నా...
రాయి వేసిన ప్రతిసారీ
నీళ్ళలో అలజడి బయలుదేరి
జోరైన అలలుగా మారి
కాసేపు నీటిలో దూరి మాయమవుతున్నాయి...
మనసులో నా రాజు
మధన భాణాలు వేసి
కనుచూపు కరువై కదిలిపోయాడు...

గుండెల్లో ప్రేమతరంగాలు చెలరేగి
దూరమవుతున్నాయి కానీ
మాయం కావడం లేదు...!



– జక్కని గంగాధర్
సెల్: 090763 52347

## శాస్త్రీయ ప్రేమ

కొన్ని దృశ్యాలను
చూసినప్పుడు కలిగే ఆరాధన
కొన్ని మాటల్ని వింటున్నపుడు
కలిగే భావన
ఇవన్నీ మనసులో మౌనంగా
శబ్దించే 'ఎకో' లు...

మొదటిసారి నిన్ను చూసినపుడు
మనసులో కదిలిన
ట్రాన్స్మిషన్...
నీతో మాట్లాడుతున్నప్పుడు
నా మనసును తట్టిలేపిన

న్యూరాన్స్...
నిన్ను తాకుతున్నప్పుడు
నా హృదయంలో పుట్టిన
డోపోమైన్...

నా ప్రేమకు కారణమైన ప్రతిదీ
నీ నుండి పుట్టినవే..!!



– కీసరి నర్సయ్య
098215 53909

## కార్మికుడు - నాయకుడు

శ్రమ ఒక్కటే నీ క్రతువు శ్రామికుడా...!
ఎదిగే క్రమంలో ఎన్నిసార్లు జారిపడ్డావో...
సిరుల పెంపకానికి నువ్ తులసి కోట...

వాడికీ నీకు పొంతనే లేదు
ఆత్మీయంగా పలకరిస్తావు నువ్వు
హామీలలో కట్టేస్తాడు వాడు...

మమకారానికి ప్రాకరం నువ్వు
వ్యర్థాల, అనర్థాల, అపార్థాల
చెత్తబుట్ట వాడు...

కాయకష్టంతో బతకీడుస్తావు నువ్వు
కాలు కదపకుండా కాసుల్లో
మునిగితేలుతాడు వాడు...

కడలంత దు:ఖానివి నువ్వు
ఖగోళమంత శ్రీమంతుడు వాడు
నీ శ్వాసలో ఆత్మ విశ్వాసం ఉంటే
వాడి శ్వాసలో అవకాశవాదముంది...

ఉన్నత వ్యక్తిత్వం నీది
మహోన్నత దోపిడి వాడిది..!!



– దేవనపల్లి ఓగన్న
సెల్:093735 60776

## మనసా నువ్వెక్కడా..?

ప్రేయసీప్రియుల వియోగంలోనా
జాలువారిన మకరందంలోనా
రాలిన సుమగంధాల లోనా..?

నన్ను దోచిన నీలోనా
నిన్ను నమ్మిన నాలోనా
ఇద్దర్ని మింగిన అహంలోనా
మధ్యలో దూరిన నోట్ల నర్తనశాలలోనా..?

బీడువారిన పొలాల పగుళ్ళలోనా
రైతు కళ్ళలో ఎదిరిచూపుల ఎడారిలోనా
ఆకలి పేగుల్లోనా.. అమాయకత్వంలోనా..?

అమ్మ ప్రేమలోనా... నాన్న భరోసాలోనా
పసిపాప నవ్వుల్లోనా..
పసిడి మెరుపుల తళుకుల్లోనా
అనాధల ఆక్రందనలోనా
నడుం వండిన వృద్ధాప్యపు వంచనలోనా..?
ఓ మనసా..!
నువ్వెక్కడో నేనెక్కడో ఉంటే
అనారోగ్యం నాకు...
అల్పత్వం నీకు..!
పద..! వైద్యం చేద్దాం
మనతోనే మొదలెట్టేద్దాం..!!



– సుజనా రాజు
098814 96122

## జీవితం

నాటి నాటికీ
మసకబారుతున్న
మానవత్వ ఛాయలు...
బంధానుబంధాలనీ
మరిచిపోయిన కాలం...
కన్నీరు పెడుతూ
ఓ చినుకై నిన్ను తాకిన క్షణం...
అవాస్తవాలని కడిగేస్తూ
వాస్తవాలకీ నిన్ను దగ్గర చేస్తుంది...

ప్రతి కథ కదన రంగమై
జననంతో మొదలై
మరణంతో ముగుస్తుంది...
నీ గతమే నీ గతిని నిర్దేశిస్తుంది
కాలగమనమే నీ కథని నడిపిస్తుంది
నీలో రగిలే ఆశయం
నీపై నీ నమ్మకం...
నీ అడుగుని కదిలిస్తుంది..!



– తాతిరాజు లక్ష్మి
సెల్:077092 27773

## అడుగు జాడలు

వడివడిగా వేస్తున్న నా అడుగులకు ముందు
అవిగో ఎవరివో పాద ముద్రలు...

నాకంటే ముందు నడిచిన వారివో
నడిపించుకు పోయిన వారివో...

స్పష్టంగా కొన్ని ... అస్పష్టంగా కొన్ని
పాతబడ్డవి కొన్ని ... కొత్తగా ఉన్నవి కొన్ని

అన్ని అడుగులు ఒకేలా లేవు
కొన్ని అడుగులు అలా చూసి వదిలేసేలా లేవు

అడుగులో అడుగేసుకుంటూ నడవడం కష్టమే
కానీ, ఇష్టంగా మార్చుకుంటే ఏదీ కష్టం కాదు కదా

ఆచి తూచి అడుగులెంచుకోవాల్సింది మనమే
వివేకావివేకాల ఫలితలం అనుభవించాల్సింది మనమే..!



– మంచాల శివ
సెల్:098332 32579




















## నువ్వు ఎప్పుడూ ఇంతే..!!

ఎందుకో ఏమో
నువ్వు ఎప్పుడూ ఇంతే..!
హృదయాన్ని చందమామ చేసి
ఎదురు చూస్తున్నప్పుడు
ఆవిరి పుట్టించే భాస్వరం కాకుండా
ఆకుపచ్చని మంచు బిందువై
తళతళలాడతావు...

ఏకాంత చిరుజల్లుల్లో
దేహాల్ని గులాబీలు చేసి
వెచ్చని కౌగిల్లో వెక్కిల్లు పడకుండా...
జోలపాటమ్మవై లాలిస్తు ఉంటావు...


కలల సరాగంలో
శృంగార గీతాల గోదారిలో
అంగాంగ తాళాలు వేయకుండా...
నుదుటిపై బొట్టువై ... బుగ్గపై ముద్దువై
కాలి అందెల సంగీతమవుతావు...

నువ్వున్నప్పుడు నేను రసగంగని
నువ్వు లేనప్పుడు నేను రసహీనని..
ఏమో..

నువ్వైతే ఎప్పుడూ ఇంతే...
నీకు దూరమైనప్పుడు నేను
శ్వాస ఆడని పసిపాపనవుతాను..!!



–వాణి శ్రీపాద
093237 25930







# రంగ రంగ వైభవంగా జరిగిన ఆరాధన 24వ వార్షికోత్సవం

## పలు రంగాల్లోని నిష్ణాతులకు పురస్కారాలు

జీవితంలో కళ ఎంతో ప్రధానమైనది. ప్రతి మనిషిలో ఏదో ఒక కళ ఉండితీరుతుంది. కొందరు త్వరగా గుర్తిస్తే. కొందరు తమలోని కళను గుర్తించకుండానే వెళ్ళిపోతారు కూడా. కానీ నేడు అనేకమంది కళాకారులున్నారు. పసివయసు నుండి వృద్ధులవరకు కళలను పోషించేవారున్నారు. కానీ వారిని గుర్తించే వారు ఎవరు? అనే ప్రశ్న వస్తే దానికి సమాధానం ఈ సాహితీ సాంస్కృతిక సంస్థలే అని ముమ్మాటికీ ఒప్పుకోవాలి. అదే పంథాలో సాగుతున్న ఆరాధన సంస్థ 1995వ సంవత్సరం ఆగస్టు 14 వ తేదీన మురళీకృష్ణ ఐఏఎస్ గారి చేతుల మీదుగా ప్రారంభమైంది. మొదట్లో నాటక కళను అభివృద్ధి చేయాలని లోకంకృష్ణయ్య మరియు తిరుమలేశ్వరరావు ఇరువురూ ఒక సంస్థను స్థాపించాలని నిర్ణయించుకుని, ఈ సంస్థకు గుదిబండి వెంకటరెడ్డి గారు అధ్యక్షులుగా, ప్రముఖ కవయిత్రి చిల్లర భవానీ దేవి వైస్ ప్రెసిడెంట్‌గా నియమించి ప్రారంభించారు. వారు అనుకున్నట్లుగా నాటకాల్ని ప్రోత్సహిస్తూ 2009 వరకు కొనసాగించేరు. ఇలా పద్నాలుగేళ్ళు గడిచాక ఈ సంస్థలోని సభ్యులందరూ వృత్తిపరంగా, ప్రవృత్తి పరంగా వారి వారి పనులలో నిమగ్నమై వారి విధులను



సభలో ప్రసంగిస్తున్న డా॥ లయన్ చిల్లా రాజశేఖర్ రెడ్డి. వేదికపై బుర్ర పద్మనాభం, శ్రీమతి ఆలపాటి లక్ష్మి, డా॥ డి.యస్.యన్.మూర్తి, బైస దేవదాసు, ఉప్పులూరి సుబ్బరాయశర్మ, లయన్ జయప్రకాశ్ రెడ్డి, జస్టిస్ శేషశయనారెడ్డి, డా॥ వోలేటి పార్వతీశం, బొట్ల శ్రీనివాస్, డా॥ తిరునగరి,శ్రీమతి అన్నపూర్ణ, శ్రీమతి ఆర్. ప్రసన్న రాణి, శ్రీమతి కత్తుల రవీందర్, డా॥ కొత్త కృష్ణవేణి.

కొనసాగించలేకపోయారు. అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న గుదిబండి వెంకటరెడ్డి గారు జీవీఆర్ ఫౌండేషన్ స్థాపించి ఆ సంబంధింత పనులలో నిమగ్నమయ్యారు. ఇక ఆపై బాధ్యతంతా లోకం కృష్ణయ్య గారిపై భారం మోపబడింది. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న రమణాచారి మరియు టి ఆర్ రాజేశ్వరరావు గార్ల సహాయ సహకారాలతో ఇప్పటివరకు దాదాపుగా 300 కార్యక్రమాలు నిర్వహించేరు.

ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఉత్తమ టెలివిజన్ న్యూస్ రీడర్స్‌కు సత్కారం, ప్రతి ఏప్రిల్ నెలలో ప్రముఖ పౌరాణిక నాటకాలకు, నాటికులకు సత్కారం, ప్రతి జూన్ మాసంలో ఉత్తమ బుల్లితెర నటులకు అవార్డులు, ప్రతి ఆగస్టు మాసంలో జరగుతున్న వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలోని నిష్ణాతులను ఎన్నుకొని తగురీతిన సత్కారం చేయడం, ప్రతి అక్టోబర్ నెలలో విజయపథంలో భార్యాభర్తల భాగస్వామ్యం పేరిట ఆయా సంబంధింత భార్యాభర్తలకు తగురీతిన సత్కారం చేయడం వీరి ఆనవాయితీగా మారింది. కళలకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉండాలని ఎరిగిన ఆరాధన సంస్థవారు ఏమాత్రం స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకుండా కళాసేవ చేయడమే దృక్పథంగా ఈ సత్కారాలను నిర్వహించడం హర్షణీయం.

ఆరాధన 24వ వార్షికోత్సవం సందర్భంగా 21-08-2019, బుధవారం సాయంత్రం శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి లో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ శేషశయనారెడ్డి మాట్లాడుతూ.. జీవితం అనేది ఒక నాటకం. తెలిసో తెలియకనో మనం అందరూ ఏదో పాత్రను పోషిస్తూనే ఉన్నాము. కుటుంబంలో ఎవరి పాత్రను వారు సక్రమంగా నిర్వహిస్తే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుంది.ఏ ఒక్క పాత్రయినా సరిగా పాటించకపోతే జీవితాలన్నీ అస్తవ్యస్తమైపోతాయి. మంచి వ్యక్తుల్ని గౌరవించుకోవడం అంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లే అన్నారు. తర్వాత ప్రముఖ కవులు జయ జయ శంకర చానల్ సి.ఇ.ఓ. డా॥ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ ఎందరో కళాకారుల్ని ప్రోత్సహిస్తూ 24వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఆరాధన సంస్థను అభినందిస్తూ.. ఈ సభ "షోడస కళానిధికి షోడసోపచారములు" అన్నట్లు నిరంతరం గురుపరంపరను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని అభిప్రాయపడ్డారు. కళాపోషకులు డా॥ లయన్ చిల్లా రాజశేఖర్ రెడ్డి సభకు అధ్యక్షులుగా, సంఘసేవకురాలు డా॥ కొత్త కృష్ణవేణి విశిష్ట అతిథిగా, కళాపోషకులు లయన్ జయప్రకాష్ రెడ్డి గౌరవ అతిథులుగా, ప్రొప్రయిటర్ రాన్సాక్ఆర్గా డా॥ రత్నకుమార్, టిడిపి ఎస్సిసెల్ అధ్యకులు బొట్ల శ్రీనివాస్, కళాపోషకులు ప్రభాకంలు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని ఘనంగా సత్కరించారు. మొదటగా శ్రీ ఉప్పలూరి సుబ్బరాయశర్మ స్థాపించిన ఉప్పలూరి దుర్గాప్రసాద్ (సంపాదకులు, చిత్రకళ పత్రిక), విజయవాడ) స్మారక నగదు పాత్రికేయ పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయులు, కొత్త తరాన్ని, పాతతరాన్ని సమపాళ్ళల్లో గుర్తిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు, శ్రీ బైస దేవదాస్, డా॥ కొర్రపాటి గంగాధరరావు స్మారక పురస్కారాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, నాటక కర్తగా, నటుడిగా ఎంతో కృషి చేసిన, చేస్తున్న ప్రముఖ నాటకప్రయోక్త, అధ్యాపకులు డా॥ డి.ఎన్.ఎన్ మూర్తికి, చింతలచెర్వు వెంకట రామారావు స్మారక నగదు పురస్కారం, రంగస్థల పురస్కారాన్ని నాటకాలలో స్త్రీలు నటిస్తుంటే అందరూ చులకనగా చూసే రోజుల్లో కూడా వీధి నాటకాలు వేసుకుంటూ నటిగా, సినిమా నటిగా ఒక స్థాయిని సొంతం చేసుకున్న శ్రీమతి ఆలపాటి లక్ష్మికి (చింతల చెర్వు వెంకట రామారావు స్మారక నగదు పురస్కారం), స్వర్గీయ జవ్వాది రామారావు పురస్కారాన్ని స్వర్గీయ పంతం పద్మనాభం నాటకపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి- కాకినాడ, బుర్రా పద్మనాభంకు, ఉత్తమ సాహితీ పురస్కారం ప్రముఖ కవి సాహితీవేత్త, డా॥ తిరునగరికి, పరిపాలనా రంగ పురస్కారాన్ని కళల పట్ల ఆసక్తి చూపుతూ, ఎందరో కళాకారుల్ని ఊతమిస్తూ, భక్తి పరురాలై, సత్సంగాలను నిత్యం ప్రోత్సహిస్తూ, వాలెంటీర్స్‌ని ఏర్పాటు చేయడం ద్వారా ఎన్నో కళలను ప్రోత్సహిస్తున్న ఉజ్జయినీ మహంకాళి దేవస్థానం మరియు కర్మాన్‌ఘాట్ దేవాలయం ఈవో, శ్రీమతి అన్నపూర్ణకు, నృత్యరంగ పురస్కారాన్ని నృత్యోదయ కూచిపూడి డాన్స్ అకాడమి డైరెక్టర్‌గా, ఒకవైపు సినిమా నటన, మరోవైపు నాటకాల్ని ప్రోత్సహిస్తూ కృషి చేస్తున్న శ్రీమతి ఆర్ ప్రసన్న రాణికి, సేవారంగ పురస్కారాన్ని ప్రముఖ సంఘసేవికురాలు, అనేక సంవత్సరాలుగా చిన్నపిల్లల ఆశ్రయం కోసం తన సొంత ఫ్లాట్స్‌ను అమ్మి దాదాపు 30 మందికి పైగా అనాథ పిల్లల్ని పోషిస్తున్న శ్రీమతి కత్తుల లక్ష్మీ రవీందర్‌కి అందజేయడం జరిగింది.

సన్మానాంతరం సన్మాన గ్రహీతలు తమ తమ అభిప్రాయాన్ని క్లుప్తంగా తెలియజేసారు. ఈ సభలో వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్యగారు సభా ప్రారంభంలో తమ సంస్థ నివేదికను, వారి ఆశయాలను కూలంకషంగా తెలియజేసారు. ఉపాధ్యక్షులు యం రమణాచారి, జాయింట్ సెక్రటరీ టి.ఆర్. రాజేశ్వరరావు పాల్గొని సభను దిగ్విజయం చేయడానికి దోహదం చేసారు. సభాకార్యక్రమానికి ముందు చిన్నారి మహతిశర్మ గానం, శ్రీ లహరి శ్రీనికేతన్ కూచిపూడి డ్యాన్స్ అకాడమి చిన్నారులచే కూచిపూడి నృత్యప్రదర్శన కనులవిందుగా సాగటం విశేషం.. మొదట సంస్థ ఆశయాలను కార్యక్రమాలను ఆరాధన సంస్థ అధ్యక్షులు లోకం కృష్ణయ్య వివరించారు. సంస్థకు మొదటి నుంచి సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



బైస దేవదాసు...



డా॥ డి.యస్.యన్. మూర్తి..



శ్రీమతి ఆలపాటి లక్ష్మి...



బుర్రా పద్మనాభం...



డా॥తిరునగరి..



శ్రీమతి అన్నపూర్ణ...



శ్రీమతి ఆర్. ప్రసన్నరాణి



తన గానంతో అందరిని అలరించిన కుమారి మహతీశర్మ...



శ్రీమతి కత్తుల లక్ష్మీ రవీందర్...

## గమ్యం వైపుగా

ఏనుగులు నడుస్తూనే ఉంటాయి
కుక్కలు మొరుగుతూనే ఉంటాయి
నడిచే ఏనుగు ఆగదు
మొరిగే కుక్క కరవదు
లక్ష్యం లక్ష్యమే
లక్ష్య సాధకుడూ అంతే
అడుగడుగునా అవాంతరాలను
కల్పించే వాళ్ళను ఢీ కొడుతూ
అజేయుడై
ముందుకు సాగుతాడు
చరిత్ర చెప్పే సత్యం ఇదే
చరిత్ర పురుషుల జీవితాలన్నీ ఇంతే
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు
అంటూ భర్తృహరి చెప్పింది ఇదే
మండుటెండ ఎప్పటికీ ఉండదు
చల్లబరిచే వర్షామేఘం వస్తుంది
కుండపోతగా కురుస్తుంది
వాతావరణం మారిపోతుంది
నిన్నటి నైరాశ్యం
నేడు ఉండదు
ఆశాగీతం విన్పిస్తుంది
నీవు లక్ష్యాల బాటలో సాగిపో
నీ స్వప్నం ఫలిస్తుంది
నీవు బహుళ పక్షాన్ని గడుపుతూపో
రేపటి శుక్లపక్ష జ్యోత్స్న నీదే
కుబుద్ధులను తన్నేస్తూపో
అవరోధాలను అధిగమిస్తూపో
లక్ష్యం వైపుగా
గమ్యం వైపుగా
మొక్కవోని ఆత్మ స్థైర్యంతో
చెక్కు చెదరని దీక్షా దక్షతతో
లక్ష్యం సాధించడం కోసం
గమ్యం చేరడం కోసం.



- డా॥ తిరునగరి
93924 65475

## గుట్టు

అసంతృప్తిని అలికారెవరో ఆకాశం నిండా
నీడలను దాచుకున్న మేఘాలు ఏజాడను
చెప్పలేనంటున్నాయి
చీకటి ముసుగేసుకున్న చెట్లు మాత్రం
గతం మూట విప్పుతుంటే
వర్తమాన వాస్తవంలా మయూర క్రేంకారం
భయపెడుతోంది
కర్ఫ్యూ సడలింపుతో కదిలిన వాహనాల్లా
ఉండుండి వీచే గాలి
ఏదోచెప్పాలనుకుంటోంది
రాత్రెప్పుడూ రహస్యసీమే
దాచుకున్న రహస్యాల గుట్టు విప్పుతుంది.



-సి.యస్.రాంబాబు
9490401005

## వానా కాలం

పల్లవి: చినుకులం-చిట్టి చినుకులం
నేలకు దిగిన-నీటి పువ్వులం
పైరును తెచ్చే- యేటి నడకలం
పదుగురు మెచ్చే- పుడమి నవ్వులం

చరణం: నీలాకాశం నీడల్లో
మబ్బుల మాటలై మురిసినా
వెన్నెలమ్మ జాడల్లో
వేకువ రవ్వలై కురిసినా

చల్లగాలి సందడిలో
నెమలీ ఆటలవుతాము
మట్టి మనసు ముచ్చట్లలో
కురిసే, ముత్యాల జల్లులవుతాము
విరిసే, హరివిల్లులవుతాము. ॥చి॥

వానమ్మ కోసం, ఎదురుచూసే
రైతు కళ్ళల్లో, మెరిసే ఆశలయ్యాము
శ్రామిక జనవాహిని కోసం
గలగలపారే సెలయేరులయ్యాము.


ఆకుపచ్చని అడవి చేతుల్లో
చల్లంగ ఒరిగే పసిపాలయ్యాము

జానపదుల కమ్మని లాలనలో
పల్లవించే ఏరువాకలయ్యాము
వానా వానా వల్లప్పా- పాటలయ్యాము ॥చి॥

నీటి మువ్వలై-నేలవొడిలో
చిన్నారుల కేరింతలవుతాము
చినుకుపిట్టలై-కొమ్మా రెమ్మల్లో
ఉయ్యాల, జంపాల ఊహలయ్యేము.

మంచు ముత్యాలై-తొలకరి ఆటల్లో
తేనెలూరు తేట తెలుగు కవితలయ్యేము
కులమత భేదాల నొదిలేము
బీదా గొప్పనే తేడాలను మరిచేము.

ప్రతీ ఇంటి ముంగిట్లలో విరిసేము
దేశానికి బంగరు పంటలు నిచ్చేము. ॥చి॥



- బి. గోవర్థనరావు
9441968930

నేటినిజం చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.








## ఓం గణపతి నమో నమః

విశ్వానికి ప్రమధనాయకుడువి
నాయనువారలను కాపాడే వాడివి
యంత్రములన్నింటిని శాసించువాడివి
కథ సుఖాంతము అవడానికి నీవే ఆద్యుడివి
చవితిదినమున ఉద్భవించినవాడివి
విఘ్నాలన్నింటిని పోగొట్టువాడివి
తిథులెన్నును అన్నింటిని త్రిప్పుగజానుడివి
క్రమముతప్పకుండా దివి నుండి భువికి
విచ్చేయుచున్న విశ్వనాధపార్వతుల తనయుడివి
కడలి ప్రకాష్ చేతికి అక్షర గణపతివై
రంగురంగులతో మెరిసిన గణాధిపా
మాలోకమందు రంగుల మనుష్యులున్నారు
వారు మాటలతో మౌఢ్యము చేయుచున్నారు
ప్రతిఒక్కరు మెసగించబడకుండా వుండి
సుఖ, సంతోషాలతో వుండేటట్లు
వరములీయవా వరప్రదాయక
వినాయక నమెనమః



-విశ్వనాథ నరసింహం
9490971589




సోమవారం ఉదయం ఖైరతాబాద్ గణపతికి పూజలు నిర్వహించిన బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, మామిడి హరికృష్ణ, వకుళాభరణం కృష్ణమోహన్, తిలక్ తదితరులు.

## గణపతి సన్నుతి

వందనాలు వేవేల వందనాలయ్యా
వందనాలు గణపయ్య వందనాలయ్యా! ॥ వంద॥

ఎలుకా వాహనమెక్కి ఏడాదికోసారి
వెలుగుల మా బ్రతుకుల్లో నింపా వచ్చేవయ్యా
ఓంకార రూపుడవై, సాకారతేజుడవై
ఒజ్జలకే ఒజ్జవైన మా బొజ్జ గణపయ్యా! ॥వంద॥

తొలిదైవము నీవంటూ కొలిచేము మేమంతా
కలికాలి తీర్చేవు లేదు మాకు ఏ చింతా
ఖండ ఖండాంతరాల ప్రవాసాంధ్ర హృదయాల
కొలువు తీరవయ్య మాకు గెలుపు నీయవయ్యా! ॥వంద॥

ఇరువదొక్క పత్రితో, తీరుకొక్క తీపితో
మురిపించీ నవరాత్రులు చేసేమయ్యా
తొండముతో దీవించీ మెండుగ వములనచ్చి
నిండైన మనసుతొ మా కండగ నుండవయ్యా! ॥వంద॥

అందరు వేల్పులకన్న ముందర పూజింతుమయ్య
విజయాలే మా కొసగే విఘ్నరాజరావయ్య
గరిక పూజకే మురిసి సిరులిచ్చే దొరవయ్య
గిరిజా సుత వరసన్నుత సరినీకు ఎవరయ్య! ॥వంద॥
గనపతి పప్పామోరియా- మోరియా మోరియా..



- చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్: 9704177270

## "మన సోపతి గణేష"
(కథ)

"ఏం రా చిన్నా అట్ల దిగాలుగ కూర్సున్నవ్?" అడిగాడు శంకర్.

'ఏం లే" అన్నడు పద్నాలుగేండ్ల చిన్న.

"మరైతె ఇక్కడెందుక్కూర్చున్నవ్? రా పోదం" పిల్సిండు శంకర్.

"యాడికి?" అడిగిండు చిన్న.

"అదేందిర అట్లడ్గుతవ్? గణేష్ పడుక్కి నెల దినాలైన లెవ్వు. మన గల్లి పోరగాల్లమంత గల్సి గణేష్ బొమ్మ పెద్దది తెచ్చి చెయ్యాలనుకున్నం యాద్మర్సినవ? ఇప్పటికె లేటైంది. చందాలడగద్దా? చల్ నడువ్" అన్నాడు శంకర్.

అడుగులైతె ఏస్తుండు గానీ చిన్నా దిమాకంత పొద్గల అమ్మ నాయనతోని జెప్పుకునిబుగులైన మాటలే చెవులకినిపిస్తుంది.

"పంట చేతికొస్తుందన్న హుషార్తోని పిల్ల పెళ్ళికి తాకతుకన్నా ఎచ్చుకిపోయి మిత్తికి పైసల్దెచ్చి పెండ్లి చేసినం. ఇప్పుడీ వర్దలొచ్చి పంటంత ఆగమైంది. తొలి పండగ వినాయకుని పండగేనాయె. చేతిల పైసల్లెవ్వని రావొద్దనెట్ల అంటం? పిండి వొంటల్జెయ్యల్ల, కొత్త బట్టలన్న పెట్టల్ల కద?" అంది చిన్న వాళ్ళమ్మ.

"ఐతేంజెయ్యమంటవ్? నాతాన పైసల్లెవ్..ఏం లెవ్. కొత్తప్పులివ్వనీకెవ్వల్లేరిక ఊర్ల" అంటా చిన్న వాళ్ళ నాయిన కోపంగ లేసి పనికి వొయ్యిండు.

ఇరవై మంది పిల్లలు చందాలడుగుతు వెళ్తుంద్రు. కొందరిస్తున్రు, ఇంకొందరు రేపు రాండ్రి మాపు రాండ్రంటున్రు. తిరిగినంత తిర్గినంక అందరు ఇండ్లకెళ్ళి తిని పండ్రి.

మర్నాడు ఇరవై మంది సోపతోల్లందర్ని దాస్కున్న పైసలేమన్నుంటె ఇస్తే మల్ల ఇస్తనంటా బతిమాల్కుండు. ఆల్లు మాక్కుడా అవుసరమేర, మాతానే సరిపొయ్నంత పైసల్లేక ఏడుస్తుంటే నీకివ్వను యాడికెల్లి తేవల్లన్నరు. దాంతో సోపతోల్లమింద గరమై చందాలకోసం ఎల్లకుండ చెరువు దగ్గరికెళ్ళిండు చిన్న.

---

పండగ ముందు దినం చిన్న వాళ్ళ అక్క బావలు ఇంటికొచ్చిరి. ఉన్నంతలొ వాళ్ళమ్మ చిన్న తెచ్చిన మట్టి గణపతిని పెట్టి తాలికల పాయసం, పులిహోర, ఉండ్రాళ్ళు జేసింది. మూడోనాడు ఊరికెళ్తుంటె వెయ్యి రూపాయిల చీర, రెడీమేట్ షరటు, ప్యాంటు పెట్టింది.

"అబ్బో...ఇదేనా తొలి పండగ మరేద?" అంటా గొణిగిన కొత్తల్లునితో పంటంత ఆగమై కష్టమొచ్చిందని దీపావలికి బంగారమేస్తామని సర్దిజెప్పి టికెట్లు కొనిపిచ్చి ఊరికి తోలిచ్చి ఊపిరిదీస్కున్రి.

"పైసల్లెవ్వు పైసల్లెవ్వంట నా పేనం దీస్తివి కద? మల్ల బిడ్డెని, అల్లున్ని వంటల్తో, బట్టల్తో ఎట్ల పెట్టి పంపినవ్? నీ సోపతోల్లిచ్చిర? లేకుంటె చిన్న గాని సోపతోల్లిచ్చిర?" అంట భార్యని అడిగిండు చిన్న నాయిన.

"అబ్బో...నాకేం టాట బిర్లాలేం కాదు నాకు తెల్సిన దోస్తులు " అంటా ముఖం తిప్పుకుంది ఆమె.

"మరైతె నీకన్ని పైసలిచ్చె సోపతిగాల్లెక్కడున్నర్రా చిన్నగా?" అనుమానం, కోపం కల్సిన గొంతుతో అడిగిండు వాళ్ళ నాయిన.

"అవున్నాయినా. నా సోపతే ఇచ్చిండు" అన్నాడు చిన్న.

"ఏం..నక్రాల్జేస్తున్నవా? అంత గొప్ప సోపతిగాళ్ళేం నీకు లేరని నాకు తెల్వదా ఏంది? చెపొరా..ఎక్కడికెల్లి దొంగికించినవ్ అంత గనం పైసల్?" అంటా కోపంగ లేసిండు గొంతులొ గుస్సతోని.

"అరె..ఆగు జర. ఆడేం ఎవ్వల్సొమ్ము ఎత్కరాలె. కష్ట పడి సంపాదించిండు" చెప్పింది చిన్న తల్లి అడ్డమొచ్చి.


"ఏం కష్టం జేసినవ్ రా. ఇంత తొందరగ పైసల్రానీకి?" అడిగిండాయన.

"చెరువు మట్టితో గణేష అచ్చులు సోపతిగాళ్ళనడిగి తెచ్చుకుని చేసి సిటీకెల్లి అమ్మిండు. ఇంక మన చుట్టుపక్కలున్న తుమ్మి, ఉమ్మెత్త, జామ, మారేడు, నేరేడు లాంటి ఆకులల్ములన్ని కోసు మూటలకెత్తి సిటీల ఎక్కువ పైసలకమ్మే మనూరి సత్తయ్యకు సగం రేటుకిచ్చి ఆ పైసలు తెచ్చిచ్చిండు. అంతె గానీ, నువ్వనుకున్నట్టు కానిపన్లేం జెయ్యలేదు నా కొడుకు" చెప్పింది చిన్న తల్లి కండ్లకెల్లి కార్తున్న నీళ్ళు కొంగుతోని తుడ్సుకుంట.

"అరె...అట్లనా? నాకు తెల్వకడిగిన. ఇంతమంచి ఆలోచనొచ్చి మన బరువు దింపె పని జేసిండంటే నేనెందుకు కోప్పడ్త?" అంటా కొడుకుని మెచ్చుకుండు.

"ఔ..నాయిన. ఉట్టిగ దోస్తుల దగ్గర పైసలెత్చుకున్నా, మల్ల ఎట్లివ్వాలె? అప్పుడె శంకరన్న చందాలకు పోదాం రమ్మని పిల్సిండు. వాళ్ళు చెప్పుకుంటె తెల్సింది ఈ పండగ వల్ల గణేషునికి కొండంత పత్రి మనమిస్తె, మనకు పైసలిస్తడని. ఇప్పుడందరూ పర్యావరణ పరిరక్షణ ఆలోచనతో మట్టి గణేషుని కొనటానికి ఇష్టపడ్తుంద్రని. అప్పుడె వచ్చిందీ ఆలోచన. నువ్వన్నట్టు ఈ పండ్గకు మన సోపతి గణేషనే అయ్యిండు" సంతోషంగ అన్నడు చిన్న.

"నిజమె రా. బగ్గ చెప్పినవ్ " అంట మనసులనే గణేషుని మొక్కింద్రు ఇద్దరు భక్తిగ.



-దేగల అనితాసూరి,
చరవాణి:9247500819

## మట్టి గణపతి -మహిమ గణపతి !

పసుపు ముద్ద తోడ
పార్వతి చేసింది
మట్టితో గణపతి
మనము చేద్దాము !

మట్టికున్న అందం
విషపు రంగులకు లేదు
మహిలోన దేవకళ
మట్టి గణపతికే మరి !

చిట్టి చేతులతో మట్టి
చిన్ని గణపతౌను
బాల గణపతి పేరుతో
బహు ప్రసిద్ధి ఔను !

అందరింటా నేడు
మట్టి గణపతికే పూజ
మట్టితో చేసినదే
మహిమ గల గణపతి !

బండెడు మట్టితో
బండి నిండార గణపతులు
బహు రూపాలతో
భళి భళి వినాయక దర్శనము !

రండి మాతోని కలవండి
మట్టిని తడపండి
వాడ వాడ ఇదిగో
మట్టి గణపతుల జాతర !



- కందాళై రాఘవాచార్య
9908612007

## గణపతి నిన్నే నమ్మితి!

కం॥గణపతి నిన్నే నమ్మితి!
క్షణక్షణమున భజనజేతు క్షమియింపుమయా!
ప్రణతులు గైకొని దేవా!
గణనాయక ! విఘ్నములను కడతేర్చుమయా!!!

కం॥వరసిద్ధి వినాయకుడా!
నిరతము నినునమ్మి కొలుతు , నీవే నన్నున్!
సరిగా కాచే తండ్రివి!
వరముల నెన్నియొ నొసంగి ఫలితంబిడుమా!!!

కం.శ్రీకరమగు మీరూపము!
నేకాలము కైనగాని నెంతో శుభమున్!
చేకూర్చుచుండు , గణపతి!
శోకములను బాపి సతము సుఖములనిమ్మా!!!

కం.శ్రీవరసిద్ధి వినాయక!
కావర గజవదన! నన్ను కారుణ్యమతిన్!
దేవాధిదేవ! శోభిత!
పావన గిరిజా సుతుండ పాలింపగదే!!!

కం॥కరిముఖ గణపతి పండుగ
మరువక జేసిన పుడమిని మనలకొసంగున్
విరివిగ సౌఖ్యములెన్నో
పరమాత్ముడు , వరప్రదాయి , పార్వతిసుతుడే!!!

సీ॥వీధివీధులయందు విఘ్నేశు కొలువుండి
పూజలొందును ముందు పుడమిపైన
ఎలుకవాహనమెక్కి కలియుగమందున్న
జనుల కావగ వచ్చె తనకుతాను
శక్తితోడ మనము సర్వేశుపుత్రుని
భక్తిమీరగ గొల్వ ముక్తినొసగు
సంకటములనన్ని సంపూర్ణముగ దీర్చి
కరుణించి కాపాడు నిరతముగను

(తే.గీ.)
భాద్రపదశుద్ధ చవితికి వైభవముగ
తొలుత మ్రొక్కులు చెల్లించ ఫలితమొసగు
విఘ్నరాజని నోరార పిలుచుచుండ
నందజేయును శుభములునందరికిని!!!




-కట్టరంజిత్ కుమార్
6300474467















## శివారెడ్డి కవిత్వంలో శాస్త్రీయ దృక్పథం: ఇనాక్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

ప్రసిద్ధ కవి శివారెడ్డి కవిత్వమంటే శాస్త్రీయ దృక్పథంతో కూడుకుని ఉంటుందని పద్మశ్రీ పురస్కార గ్రహిత, ఎపీ సాహిత్య అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో తెలుగులో తొలిగా సరస్వతి సమ్మాన్ పురస్కారం పొందిన ప్రసిద్ధ కవి కే. శివారెడ్డి కవితా సంపుటి 'పక్కకి ఒత్తిగలితే" పునర్ముద్రణ పరిచయ సభ శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ శివారెడ్డి కవిత్వమంటే శాస్త్రీయ దృక్పథమని చరిత్ర భౌతికవాదం అని పేర్కొన్నారు. శివారెడ్డి కవితా సంపుటి తెలుగులో తొలిగా సరస్వతి సమ్మాన్ పొందిన పుస్తకాన్ని ఆవిష్కరించే గొప్ప అవకాశం తనకు లభించిందన్నారు. ఏ కవి ప్రభావానికి లోను కాకపోవడం శివారెడ్డి ప్రత్యేకత అని వివరించారు. ఆయన కవిత్వాన్ని మొత్తం చూస్తే వ్యవస్థలో మార్పులు జరగాలి. ప్రజల చైతన్యం నిరంతరం పెరగాలి వంటి అంశాలు ఉంటాయని, శివారెడ్డి శ్రామికవర్గ రచయిత అని తెలిపారు. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత దేవిప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ శీలాలోలిత, సాహితీవేత్త తెలకపల్లి రవి, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కే.ఆనందచారి, ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ కవి డాక్టర్ సీతారామ్, యాకుబ్, కోయ చంద్ర మోహన్, తంగిరాల చక్రవర్తి, భూపతి వెంకటేశ్వర్లు, మోహన్ కృష్ణ, శిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## వైరుధ్యాల పుట్ట

ఒకానొక ప్రశ్న బలంగానే వున్నా
బలహీనంగా తయారయిన తర్వాత
గాలి భయపడుతూ సాగిలబడింది
ఆకావం నల్లటి మబ్బులతో కమ్ముకొన్న
తర్వాత
చినుకు రాలుతుందని
దప్పిక తీరుతుందని
నేల ఆశ నెరవేరుతుందనే కాంక్ష
చీకట్లో కలగా మారిన తర్వాత-
ఆకాశం స్వేచ్ఛలేక ఉరితాడు బిగించుకుందిప

అరణ్యం మీద పులి పెత్తనం నశిస్తున్న కాలంలో
కార్పొరేట్ చట్టాలు
అడవిని పరిపాలించాలని
పులులను వేటాడటం ప్రారంభించాయి

జింకలు కుందేళ్లు తిరుగబడుతున్నాయి
విజయం ఎవరిదో చరిత్ర చెపుతుంది

వరద ఉధృతి పెరిగిన మాట నిజం
నీరు నిప్పుగా మారుతున్న మాట నిజం
ఆనకట్ట వుంటుందా వూడుతుందా?
వైరుద్యాల దోపిడి వ్యవస్థ
పునాదులు కదులుతున్నట్టు
కనులలో కాంతి కదులుతుంది.



- సి.హెచ్. మధు
9949486122

